కొంత ఎక్కువ.. ఎంతో తక్కువ..



- మిశ్రమంగా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్
- దీర్ఘకాలిక ప్రాజెక్టులకు కానరాని మోక్షం
- కొన్ని పనులకు నిధుల కేటాయింపు
- విమానాశ్రయం, లెదర్ పార్కు ఏర్పాటు దిశగా అడుగులు
- జిల్లాకో కేన్సర్ ఆస్పత్రి ప్రకటనతో ప్రయోజనం
- చిన్నపరిశ్రమలు, స్టార్టప్‌లకు చేయూత
- ఆదాయం పన్ను పరిమితి పెంపుతో హర్షం
- కిసాన్ కార్డు రుణ పరిమితి పెంపుతో ఆనందం
- అసంఘటిత కార్మికులకు వైద్య భరోసా
- నిర్మలమ్మ కేంద్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

కేంద్ర బడ్జెట్ - 2025 ఉమ్మడి వరంగల్ జిల్లాకు కొంత మోదం.. కొంత ఖేదం కలిగించింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఓరుగల్లు ప్రజలకు పెద్దగా వరాలను ఏమీ కురిపించలేదు. కొన్ని ప్రతిపాదిత పథకాలకు నిధులను కేటాయించి సంతోషపెట్టారు. అయితే దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను ప్రస్తావించలేదు. నిధులూ కేటాయించలేదు. రైల్వే పరంగా కొత్త లైన్లు, ప్రాజెక్టులు ప్రకటించలేదు. ఏళ్ల కల అయిన కాజీపేట రైల్వే డివిజన్ ప్రస్తావన లేదు. కోచ్ ఫ్యాక్టరీకి మాత్రం నిధులు ఇచ్చారు. ఇక మెగా టెక్స్‌టైల్ పార్కుకు నిధుల ఊసేలేదు. అలాగే మేడారం జాతరకు జాతీయ హోదా దక్కలేదు. బయ్యారం ఉక్కుఫ్యాక్టరీ ముచ్చటే లేదు. అయితే పేద, మధ్య తరగతి వర్గాలకు మాత్రం కేంద్రం వరాలను కురిపించింది. రైతులకు పెద్ద పీట వేసింది. చిన్న, మధ్య తరహా పరిశ్రమల వృద్ధికి చేయూతనిచ్చింది. ప్రధానంగా ఆదాయం పన్ను విషయంలో భారీ ఊరటను కల్పించింది. రూ.12లక్షల మేర ఆదాయం వరకు పన్నును మినహాయించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో సుమారు 18 లక్షల మంది మధ్యతరగతి వారికి లబ్ధి కలుగనున్నది. విమానాశ్రయాలను అభివృద్ధి చేస్తామనే ప్రకటతో మామునూరు ఎయిర్‌పోర్టుకు అడుగులు పడనున్నాయి. చిన్న పరిశ్రమలకు రాయితీ ప్రకటనతో పరిశ్రమల ఏర్పాటుకు పూల బాట పడనుంది. అలాగే జిల్లాకో కేన్సర్ ఆస్పత్రి ఏర్పాటుతో ఉమ్మడి జిల్లాలో ఆరు ఆస్పత్రులు నిర్మించనున్నారు. అసంఘటిత కార్మికులకు కేంద్రం శుభవార్త చెప్పింది. హెల్త్ కార్డులు అందించి యేటా రూ.5లక్షల వరకు ఆరోగ్య సదుపాయం కల్పించింది. మొత్తంగా కేంద్ర బడ్జెట్ ఉమ్మడి జిల్లా ప్రజలకు కొంత ఆశాజనకంగా ఉన్నట్లు ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

- హనుమకొండ, ఆంధ్రజ్యోతి



మోదం

- మామునూరు విమానాశ్రయం
- లెదర్ పార్కు
- చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు
- రూ.12లక్షల వరకు పన్ను మినహాయింపు
- కిసాన్ క్రెడిట్ కార్డు రుణ పరిమితి పెంపు
- ఆరు జిల్లాల్లో కేన్సర్ ఆస్పత్రుల ఏర్పాటు
- అసంఘటిత కార్మికులకు వైద్య భరోసా

ఖేదం..

- కాజీపేట రైల్వే డివిజన్ ప్రస్తావన కరువు
- కొత్త రైల్వే మార్గాల ఊసే లేదు..
- సైనిక్ స్కూల్ మాటే లేదు..
- కానరాని గిరిజన విశ్వవిద్యాలయం
- మెగా టెక్స్‌టైల్ పార్కుకు నిధులు లేవు
- మేడారం జాతరకు జాతీయ హోదా లేదు
- బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ముచ్చటే లేదు

వివరాలు : 8లో..

గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయండి

- కుడా వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడే



మ్యూజికల్ గార్డెన్‌లో పరిసరాలు పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నిర్దేశిత గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలని బల్దియా కమిషనర్, కుడా వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. శనివారం కుడా ఆధ్వర్యంలో కాకతీయ మ్యూజికల్ గార్డెన్స్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. అక్కడ జరుగుతున్న పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ.. గార్డెన్‌లోని పిల్లల పార్కులో గతంలో ఏర్పాటు చేసిన పరికరాలు, ఆట వస్తువులు దెబ్బతింటే వెంటనే వారికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని సూచించారు. క్యాంటీన్ ముందు భాగంలో గ్రీనరీ ఏర్పాటు చేయాలన్నారు. గార్డెన్ ప్రాంతం నుంచి నాలా వెలుతున్నందున చెత్తా చెదారం రాకుండా ఉండడానికి గార్డెన్ ముందు వైపు జాలి ఏర్పాటు చేయాలన్నారు. నిర్మాణ సంబంధ అన్ని పనులు మార్చి చివరి వారం వరకు పూర్తి చేయాలన్నారు. భద్రకాళి బండ్‌లో పూడిక తీత (డిస్ట్రిలింగ్) ప్రాంతాన్ని వైస్ చైర్మన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కుడా సీపీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావుతో పాటు కుడా అధికారులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో ఆదివారం జరగనున్న బీసీ యుద్ధభేరి సభకు సిద్ధమవుతున్న ప్రాంగణం



కోటా కోసం కొట్లాట!

నేడు ఓరుగల్లులో బీసీ జంగ్ సైరన్

- ఆర్ట్స్ కాలేజీలో లక్ష మందితో బీసీ యుద్ధభేరి
- పార్టీలకు అతీతంగా ఏకమవుతున్న ప్రజాప్రతినిధులు
- కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం 42శాతం రిజర్వేషన్ కోసం డిమాండ్
- ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ల రద్దు, మహిళ రిజర్వేషన్లలో బీసీల వాటా
- బీసీ కోటా తేలాకే స్థానిక ఎన్నికలు పెట్టాలని డిమాండ్
- బీసీ యుద్ధభేరికి జాతీయ నేతలను ఆహ్వానించిన నిర్వాహకులు

8

ఆపరేషన్ స్మైల్ ద్వారా 161మంది చిన్నారులకు విముక్తి

- వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ స్మైల్ ద్వారా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 161 మంది చిన్నారుల విముక్తి కలిగించినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ పేర్కొన్నారు. జనవరి మొదటి తారీఖు నుంచి నెలాఖరు వరకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో వరంగల్ పోలీస్ కమిషనరేట్ బలగాలు, బాలల సంరక్షణ విభాగం, చైల్డ్‌లైన్, కార్మికశాఖతో కలిసి హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల్లో సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో బాల కార్మికుల, బడి మానేసిన 161 మంది బాలబాలికలను గుర్తించి వారిని బాలల సంరక్షణ గృహానికి తరలించామన్నారు. వీరిలో 137 మంది బాలలు, 24 మంది బాలికలు ఉన్నారన్నారు. బాలల సంరక్షణ గృహానికి తరలించిన వారిలో తెలంగాణకు చెందిన వారు 92, ఇతర రాష్ట్రాలకు చెందిన వారు 69 మంది ఉన్నారన్నారు. చిన్నారులతో పనిచేయించుకున్న ఏడుగురు యాజమానులపై కేసు నమోదు చేశామన్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన బాలికను దర్పణ్ యాప్ ద్వారా గుర్తించి తల్లితండ్రులకు అప్పగించామన్నారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, చిన్నారులను పనిలో పెట్టుకునే యజమానులకు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.50వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

శాసన మండలి ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- ఎన్నికల ప్రవర్తనా నియామవళి పకడ్బందీగా అమలు చేయాలి
- వీసీలో కలెక్టర్లతో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి



వీసీలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి



హనుమకొండ కలెక్టరేట్ నుంచి వీసీలో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య, ఇతర అధికారులు

హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): శాసన మండలి సభ్యుల ఎన్నికలు సజావుగా జరిగేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి సుదర్శన్‌రెడ్డి టీచర్స్ ఎమ్మెల్సీ స్థానం ఎన్నికలపై ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయుల స్థానానికి ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో ఎన్నికలు జరిగే జిల్లాల వ్యాప్తంగా ఎన్నికల నియామవళి కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. 24 గంటలు, 48 గంటలు, 72 గంటలలో తీసుకోవాల్సిన చర్యలపై రిపోర్టు అందించాలన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించి నోటిఫికేషన్ ఫిబ్రవరి 3న విడుదల చేస్తామని, ఫిబ్రవరి 3 నుంచి ఫిబ్రవరి 10వరకు నామినేషన్ల స్వీకరణ, 11న స్క్రూటినీ, 13లోపు ఉపసంహరణ గడువు ఉంటుందని, ఫిబ్రవరి 27న పోలింగ్ జరుగుతుందని, మార్చి 3న ఫలితాలు ఉంటాయన్నారు. హనుమకొండ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాలో ఉపాధ్యాయులకు సంబంధించి 24 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, జిల్లాలో ఎన్నికల ప్రవర్దనా నియమావళికి సంబంధించిన నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాలో 13 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సహకరించాలి

- రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరిన కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ, ఖమ్మం, వరంగల్ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ కోరారు. శనివారం వరంగల్ కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 3 నుంచి 10 వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, 11న స్క్రూటీని, 13న ఉపసంహరణ ఉంటుందని అన్నారు. ఈ నెల 27వ తేదీన ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. మార్చి 3న నల్లగొండ జిల్లాలో ఓట్లను లెక్కిస్తారని తెలిపారు. వరంగల్ జిల్లాలో మొత్తం 13 పోలింగ్ కేంద్రాలను ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌వో విజయలక్ష్మీ, ఎలక్షన్ డీటీ రంజిత్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎండి.నేహాల్, హరిశంకర్, అనిల్ కుమార్, కుసుమ శ్యాంసుందర్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

రానున్న పంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని 317గ్రామ పంచాయతీలు ఉన్నాయని, వాటిలో సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం అర్హులను ఎంపిక చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీపీవో కల్పన, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, హౌసింగ్ పీడీ గణపతి, ఎంపీడీవోలు, ఎంపీవోలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సోనియా వ్యాఖ్యలు దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం

బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర నాయకుడు మాను నాయక్



అమరవీరుల స్థూపం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ ఎస్టీ మోర్చా నాయకులు

రాంనగర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రపతి ద్రౌపది ముర్ముపై సోనియాగాంధీ చేసిన వ్యాఖ్యలు ఆమె దిగజారుడు రాజకీయాలకు నిదర్శమని బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర నాయకుడు మాను నాయక్ అన్నారు. ద్రౌపది ముర్ముపై సోనియాగాంధీ వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం హనుమకొండ అమరవీరుల స్థూపం వద్ద ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతి ఆధ్వర్యంలో సోనియాగాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు రాగా, సుబేదారి పోలీసుల అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు నాను నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్రపతిపై అహంకార వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమే అన్నారు. సోనియా వ్యాఖ్యలు భారతీయ మనోభావాలను దెబ్బతీశాయన్నారు. కాంగ్రెస్ వైఖరిని మహిళా సమాజం, దేశ ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యాన్ని అవమానించిన సోనియాగాంధీ వెంటనే క్షమాణలు చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గణేశ్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, 61వ డివిజన్ అధ్యక్షుడు లావుడ్య రఘు, నవీన్, రవి తదితరులు పాల్గొన్నారు.

భారీగా గుట్కాల పట్టివేత

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీసు కమిషరేట్ పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న గుట్కాలను పట్టుకొని సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. నర్సంపేట పీఎస్ పరిధిలో సాయినగర్‌కు చెందిన సంతోషిమాత కిరాణం నిర్వాహకుడు మల్యాల మధు నుంచి రూ.5,550 విలువ చేసే గుట్కాలు, పాఖాల రోడ్డులో కొలరియా విజయ్ నుంచి రూ.7,800 విలువ చేసే గుట్కాలు, మల్యాల సదానందం నుంచి రూ.26,200 గుట్కాలు, వల్లభ్‌నగర్‌లోని శ్రీకాంత్ నుంచి రూ.91,600 గుట్కాలను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. అదే విధంగా మిల్స్‌కాలనీ పరిధిలో శివనగర్‌కు చెందిన కొంతం చంద్రయ్య నుంచి రూ.14,560 విలువ చేసే గుట్కాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఐనవోలు పీఎస్ పరిధిలో పీడీఎస్ రైస్ తరలిస్తుండగా ఆటో సీజ్‌చేసి రూ.15,000 విలువ చేసే 6క్వింటాళ్ల రైస్‌ను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా మిల్స్‌కాలనీ పీఎస్ పరిధిలో 14 క్వింటాళ్ల రైస్‌ను పట్టుకున్నట్లు ఏసీపీ మధుసూదన్ తెలిపారు.

కొంత ఎక్కువ ఎంతో తక్కువ

మిశ్రమంగా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్

- దీర్ఘకాలిక ప్రాజెక్టులకు కానరాని మోక్షం
- కొన్ని పనులకు నిధుల కేటాయింపు
- నిర్మలమ్మ కేంద్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

హనుమకొండ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన 2025 కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ ఆశించిన కేటాయింపులైతే లేవు. దీర్ఘకాలకంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల ఊసే లేదు. కొత్త రైల్వే ప్రాజెక్టులు, మార్గాల ప్రస్తావన కానరాలేదు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు ప్రకటన ఈసారి బడ్జెట్‌లో చోటుచేసుకోలేదు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు కేంద్రం తన వంతుగా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తుందని వరంగల్‌వాసులు పడిన ఆశ నిరాశే అయింది. సైనిక్ స్కూల్ ఏర్పాటు ప్రస్తావన కూడా లేదు. ఎన్నో దశాబ్దాలుగా కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్న కాజీపేటకు రైల్వే డివిజన్ హోదా కూడా ఈసారి బడ్జెట్‌లో కూడా హుళక్కే అయింది. ములుగులో ఏర్పాటవుతున్న కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయానికి ప్రత్యేకంగా నిధులేవీ కేటాయించలేదు. మేడారానికి జాతీయ హోదా కల్పన ఈసారి కూడా కలగానే మిగిలింది. నగరంలో భూగర్భ డ్రైనేజీకి రూ.4,170 కోట్లు ఇవ్వాలని, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను పీఎం మిత్రలో చేర్చి రూ.300 కోట్ల గ్రాంట్ ఇవ్వాలని, లెదర్‌పార్క్, సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని, కాజీపేట - భూపాలపల్లితో పాటు మూడు కొత్తలైల్వే లైన్లు, ప్రాజెక్టులు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. జిల్లా ప్రజాప్రతినిధులు సైతం ఢిల్లీలో సంబంధిత శాఖల కేంద్ర మంత్రులను కలిసి వినతి పత్రాలను సమర్పించారు. వీటిలో వేటికీ బడ్జెట్‌లో చోటు దక్కలేదు.

ఆదాయపు పన్ను శ్లాబు పరిమితి పెంపు

ఉద్యోగులు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న ప్రకటనకు ఎట్టకేలకు ఈ బడ్జెట్‌లో మోక్షం కలిగింది. ఆదాయ పన్ను శ్లాబు పరిమితిని పెంచుతున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటనతో ఉద్యోగుల్లో సంతోషం వ్యక్తం అవుతున్నది. ఇకపై రూ.12లక్షల వరకు ఆదాయ పన్ను ఉండదని స్పష్టం చేశారు. సవరించిన స్లాబ్‌ల ప్రకారం రూ.4లక్షల వరకు ఆదాయంపై ఎలాంటి పన్ను ఉండదు. బడ్జెట్‌లో సవరించిన స్లాబుల ప్రకారం మధ్య తరగతిపై పన్ను భారం గణనీయంగా తగ్గనున్నది. దీని వల్ల ఉమ్మడి జిల్లాలో ఉన్న సుమారు 18 లక్షల మంది మధ్య తరగతి వారికి లబ్ధి కలుగనున్నది.

కొన్నిటికి మోదం

కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కేంద్ర బడ్జెట్‌లో కొంత మేరకు నిధుల కేటాయింపు జరిగినట్టు సమాచారం. అలాగే మామునూరు విమానాశ్రయం ఏర్పాటుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. లెదర్ ఉత్పత్తుల తయారీకి బడ్జెట్‌లో ప్రభుత్వం రాయితీలు ప్రకటించినందువల్ల ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న లెదర్ పార్కు జనగామ జిల్లాలో ఏర్పాటయ్యే అవకాశాలు కొంత మేరకు ఉన్నట్టు తెలుస్తోంది. బడ్జెట్‌లో వివిధ రంగాలకు ఇచ్చిన రాయితీలు, ప్రోత్సాహకాలు ఇతరత్రా వాటి వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 10 లక్షల మంది ప్రజల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధి పొందే అవకాశం ఉన్నట్టు ఆర్థిక రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆదాయం పన్ను పరిమితి పెంపు వల్ల వరంగల్ జిల్లాలో సుమారు లక్షన్నర మందికి ప్రయోజనం కలుగనున్నది. మొత్తానికి బడ్జెట్ పట్ల అన్నివర్గాల ప్రజల్లో మిశ్రమ స్పందన వ్యక్తం అవుతోంది.



రైతులకు చేయూత

బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం కిసాన్ క్రెడిట్ కార్డుల రుణ పరిమితిని పెంచడంతో రైతులకు ఆర్థికంగా చేయూత లభించినట్లయింది. రైతులకు తక్కువ వడ్డీకే రుణాలిచ్చే కిసాన్ క్రెడిట్ కార్డు రుణ పరిమితిని రూ.3లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచడం వల్ల ఉమ్మడి జిల్లాలో సుమారు 12 లక్షల మంది రైతులకు ప్రయోజనం సమకూరనున్నది. 1998లో ప్రవేశపెట్టిన కిసాన్ క్రెడిట్ స్కీమ్ కింద ఉమ్మడి జిల్లాలో లక్షలాది మంది రైతులు లబ్ధిపొందుతున్నారు. అయితే ఈ కార్డురుణ పరిమితిని కేంద్ర ప్రభుత్వం చాలాకాలం సవరించలేదు. ఈ పథకం కింద రైతులు 9 శాతం వడ్డీ రేటుతో రుణాలు తీసుకుంటున్నారు. అయితే ప్రభుత్వం 2శాతం వడ్డీ రాయితీగా అందిస్తోంది. అదనంగా రైతులు తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లించినట్లయితే రైతులు మరో 3 శాతం వడ్డీ రాయితీని పొందుతారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రైతులు రూ.360 కోట్ల మేరకు రుణాలు తీసుకున్నారు. కార్డు రుణ పరిమితిని రూ. 5లక్షలకు పెంచడంవల్ల రైతులు మరింత రుణం తీసుకునే వెసులుబాటు లభించనున్నది.

విమానాశ్రయానికి మార్గం

కేంద్ర బడ్జెట్‌లో కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు పెద్ద పీట వేశారు. పారిశ్రామిక, వ్యాపార, పర్యాటక రంగాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని దేశ వ్యాప్తంగా 150 విమానాశ్రయాల ఏర్పాటుకు బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఇందులో భాగంగా వరంగల్ జిల్లా మామునూరులో విమానాశ్రయం ఏర్పాటుకు కేంద్రం నుంచి నిధులు అందే అవకాశం ఉంది. ఇప్పటికే మామునూరు విమానాశ్రయం అభివృద్ధికి చర్యలు ప్రారంభమయ్యాయి. అదనంగా అవసరమైన స్థల సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కూడా ఇచ్చింది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ విమానాశ్రయంగా అభివృద్ధి చేయడానికి కేంద్రం నుంచి నిధులు అందే అవకాశం ఉంది.

ఉమ్మడి జిల్లాల్లో క్యాన్సర్ కేంద్రాలు

ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రతీ జిల్లాలో క్యాన్సర్ కేంద్రాలు ఏర్పాటు చేయబోతున్నట్టు ప్రకటించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలోనూ 200 జిల్లా కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ లెక్కన ఉమ్మడి వరంగల్ పరిధిలోని ఆరు జిల్లాల్లో రాబోయే రోజుల్లో క్యాన్సర్ ఆస్పత్రులు అందుబాటులో రానున్నాయి. ఈ యేడు వరంగల్ లేదా హనుమకొండ జిల్లాల్లో ఏదో ఒక దానిలో క్యాన్సర్ ఆస్పత్రి ఏర్పాటయ్యే అవకాశం ఉంది. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో క్యాన్సర్ విభాగం ఉన్నప్పటికీ దాని ద్వారా క్యాన్సర్ రోగులకు పూర్తి స్థాయిలో చికిత్స అందడం లేదు. దీంతో వీరంతా ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. జిల్లాకో కేన్సర్ కేంద్రం ఏర్పాటుతో క్యాన్సర్ రోగులకు ఊరట లభించినట్లవుతుంది.

చిన్న పరిశ్రమలకు ఊతం

బడ్జెట్‌లో ఎంఎస్‌ఎంఈ, స్టార్టప్‌లకు ఊతం ఇస్తూ ప్రోత్సాహకాలు ప్రకటించడం వల్ల ఉమ్మడి జిల్లాలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఊతం లభించనున్నది. ప్రభుత్వం ఇచ్చే రాయితీతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు చిన్నతరహా పరిశ్రమలు స్థాపించేందుకు మరింత ముందుకు వచ్చే అవకాశం ఉంది. స్టార్టప్‌లకు రూ.20కోట్ల వరకు రుణాలు ఇవ్వనున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలమ్మ ప్రకటించారు. అంకుర సంస్థలకు ప్రత్యేక క్రెడిట్ కార్డులు ఇస్తామని తెలిపారు. స్టార్టప్‌లకు ప్రోత్సాహకంగా రూ.5లక్షల పరిమితి కలిగిన క్రెడిట్ కార్డుల ఇవ్వనున్నట్టు, 10 లక్షల మందికి ఈ కార్డులు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో మైక్రోస్కేల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ)లు 2,971 ఉన్నాయి. స్టార్టప్‌ల కోసం జిల్లా పరిశ్రమ కేంద్రాల్లో 712 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

గిగ్ వర్కర్లకు శుభవార్త

అసంఘటిత రంగాల ఉద్యోగులకు (గిగ్ వర్కర్లు) కేంద్రం శుభవార్త తెలిపింది. 2025 బడ్జెట్ ద్వారా వారికి గుర్తింపుతో పాటు ఆరోగ్య బీమా సదుపాయం కల్పించాలని నిర్ణయించింది. దీని వల్ల ఉమ్మడి జిల్లాలోని 2.10 లక్షల మంది గిగ్ వర్కర్లకు మేలు కలుగనున్నది. ఈ-శ్రమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించనున్నట్టు ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల గిగ్ వర్కర్లకు గుర్తింపుకార్డులు లభిస్తాయి. అలాగే ప్రధాన మంత్రి ఆరోగ్య యోజన (పీఎం-జేఏవై) కింద ఉద్యోగికి, కుటుంబానికి ఏడాదికి రూ.5లక్షల దాకా ఆరోగ్య బీమా సదుపాయం అందుబాటులోకి రానున్నది. తాత్కాలికంగా తమకు ఉన్న వీలును బట్టి ఉద్యోగాలను చేసేవాళ్లను గిగ్ వర్కర్లు అంటారు. ప్రత్యేకించి యాప్‌ల ద్వారా సేవలందించే ఉద్యోగాల్లో ఎక్కువమంది ఉంటారు. డెలివరీ యాప్‌లు, రైడ్ యాప్‌లతో పని చేసే ఉద్యోగులతో పాటు ఫ్రీ లాన్సర్లు, ఆన్‌లైన్ ట్యూటర్లు ఈ విభాగంలోకి వస్తారు. ఉమ్మడిజిల్లా ఈ తరహా ఉద్యోగులకు బడ్జెట్‌లో తీసుకున్న నిర్ణయంతో ఊరట కల్పించారు. ఈ ప్రోత్సాహకాల వల్ల ఉమ్మడి జిల్లాలో ఉన్న సుమారు లక్ష మంది గిగ్ వర్కర్లు మేలు జరగనున్నది.

వికసిత్ భారత్‌కు బాటలు
రావు పద్మ, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు



పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్ వికసిత్ భారత్‌కు బాటలు వేయవచ్చు. పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి ప్రధాని ఎల్ల వేళలా ముందుంటాడని అనడానికి ఈ బడ్జెట్‌తో నిరూపణ అయింది. ఉద్యోగులకు ఇన్‌కమ్ టాక్స్ పరిధి 12 లక్షలకు పెంచడం సంతోషకరమైన విషయం. స్వయం ఉపాధి పొందే యువతకు అవకాశాల్ని పెంచుతూ పరిశ్రమల స్థాపనకు రుణ పరిమితిని పెంచి చేయూతనిచ్చిన బడ్జెట్. ప్రాణాధర మందుల ధరలను తగ్గేలా నిర్ణయం తీసుకోవడం మోదీ ప్రభుత్వం మానవత దృక్పథానికి నిదర్శనం.

ప్రభుత్వ విద్యకు గ్యారెంటీ లేదు
కడారి భోగేశ్వర్, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి



దేశ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి అరకొర నిధులే కేటాయించారు. 50.65 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యా రంగానికి 1,28,650 కోట్లు మాత్రమే కేటాయించారు. బడ్జెట్‌లో ఇది 2.53 శాతమే. గత బడ్జెట్ కంటే ఈ ఏడాది బడ్జెట్‌లో 0.03 శాతం నిధులు తక్కువగానే కేటాయించారు. ఇంత తక్కువ కేటాయింపులతో ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యమవుతుంది. ప్రైవేటు విద్యా రంగానికి ఊతమిచ్చేదిగా ఉంది. కేంద్ర బడ్జెట్‌లో కనీసం 6 శాతం నిధులు కేటాయిస్తేనే విద్యా రంగాన్ని బలోపేతం చేయవచ్చు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి
సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాసరావు



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు మరోసారి తీవ్ర అన్యాయం జరిగింది. తెలంగాణకు ప్రత్యేక కేటాయింపులు ఏమీలేవు. బీహార్ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అభివృద్ధి, ప్రత్యేక నిధుల కేటాయింపులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. తెలంగాణకు ఐఐఎం ఐజీటీ, సైనిక్ పాఠశాలలు, కేంద్ర విద్యాసంస్థలు రావాల్సి ఉండగా వాటిని పట్టించుకోలేదు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ముందడుగు వేయడంలో అవసరమైన నిధులను కేటాయించలేదు. ఓట్లు, సీట్లకు బీజేపీ ప్రథమ ప్రాధాన్యత ఇచ్చింది.

ఇది సంతులిత, వృద్ధి ఆధారిత బడ్జెట్
తిప్పర్తి రాఘవరెడ్డి, సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్



కేంద్ర బడ్జెట్ సంతులిత, వృద్ధి ఆధారిత బడ్జెట్. బడ్జెట్‌లో ఆర్థిక వృద్ధి, మధ్య తరగతి ప్రజలకు పన్ను ఉపశమనం, వ్యాపార ప్రోత్సాహంపై ప్రధానంగా దృష్టి సారించింది. ప్రధాంగా రూ.12 లక్షల వరకు ఆదాయానికి పన్ను మినహాయింపు, మూలధన వ్యయం పెంపు, ఎంఎస్ఎంఈ, స్టార్టప్‌లకు మద్దతు, బీమా రంగంలో ఎఫ్‌డీఐ సంస్కరణలు ప్రధానంగా చెప్పుకోదగ్గవి. మధ్య తరగతి వేతన జీవులకు భారీ పన్ను ఉపశమనం కలిగించడం ముదావహం. అధిక మూలధన వ్యయం, దీర్ఘకాలిక ప్రోత్సాహం బడ్జెట్‌లో పాజిటివ్ అంశాలు. బడ్జెట్‌లో రైతులకు కొత్త పథకాలను ప్రవేశపెట్టడం, పీఎం ధన్ ధ్యాన్ కృషి యోజన ద్వారా 1.7 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరునున్నది. ఎంఎస్ఎంఈ, సహకార రంగాలకు రుణ సదుపాయాలను కల్పించడం వల్ల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు వృద్ధి చెందడానికి అవకాశం ఉంది.

అలరించిన సినీ సంగీత యుగళ గాన విభావరి


సినీ యుగళ గీతాలను ఆలాపిస్తున్న గాయకుడు చోటు సింగర్

వడ్డెపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): శ్రీసాయి మీరా కల్చరల్ సొసైటీ హనుమకొండ, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వారి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సినీ సంగీత గాయకుడు సింగర్ చోటు 101 మంది గాయనీమణులతో సినీ నేపథ్య గాయకుడు, గాన గంధర్వుడు దివంగత ఎస్‌పీ బాలసుబ్రహ్మణ్యం తెలుగు సినిమా చిత్రాల్లో పాడిన పాటలు ఆద్యంతం అలరించాయి. కర్ణాటక సంగీత విద్వాంసులు ప్రొఫెసర్ వి.తిరుపతయ్య, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ జూరీ మెంబర్, చీఫ్ కోఆర్డినేటర్ టీవీ అశోక్‌కుమార్, విశ్వకర్మ (సాయిమీర కల్చరల్ సొసైటీ చైర్మన్), కర్ణకంటి పోతనాచారి తదితరులు ఎస్‌పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూల మాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి గాన విభావరిని లాంచనంగా ప్రారంభించారు. 101మంది గాయనీమణులతో ప్రధాన గాయకుడు చోటు సింగర్ 12గంటల పాటు నిర్విరామంగా సినీ సంగీత యుగళగాన విభావరిని నిర్వహించారు. కార్యక్రమంలో రావులకొలను రాంమూర్తి, రాపాక పులిగిళ్ల వెంకటపద్మావతి, మగ్దుం మొహీయుద్దీన్ సహకారంతో విభావరిని బి. భువన నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి గాయనీమణులు పాల్గొని తమ గానామృతాన్ని వినిపించి ప్రేక్షకులను మంత్రముగ్దుల్ని చేశారు. అనంతరం గాయనీమణులకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్లను నిర్వాహకులు ప్రదానం చేశారు.

కోటా కోసం కొట్లాట!

- నేడు ఓరుగల్లులో బీసీ జంగ్ సైరన్
- ఆర్ట్స్ కాలేజీలో లక్ష మందితో బీసీ యుద్ధభేరి
- బహిరంగ సభకు రానున్న జాతీయ నేతలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

బీసీ ఉద్యమానికి పోరాటాల గడ్డ ఓరుగల్లు వేదికవుతోంది. బీసీల హక్కుల కోసం రాజకీయాలకతీతంగా ప్రజాప్రతినిధులు ఒకే వేదికపైకి రాబోతున్నారు. ఆదివారం హనుమకొండ ఆర్ట్స్ కాలేజీలో లక్ష మందితో బీసీ యుద్ధభేరి సభను నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులతో పాటు జాతీయ బీసీ నేతలను ఆహ్వానిస్తున్నారు. ఇప్పటికే సభ ఏర్పాట్లను పూర్తి చేశారు. బీసీలను సభకు భారీగా తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో ఈ సభ నిర్వహిస్తుండటం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

రిజర్వేషన్ల పెంపు

బీసీలకు రాజకీయ పార్టీలు ఇస్తున్న హామీలను అమలు చేయాలనే డిమాండ్‌తో బీసీ యుద్ధభేరి నిర్వహిస్తున్నారు. రిజర్వేషన్లలో తమ వాటా.. కోటా.. కోసమే యుద్ధభేరి మోగిస్తున్నట్లు పేర్కొంటున్నారు. ప్రధానంగా గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల హామీని అమలు చేసిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ పొలిటికల్ జేఏసీ డిమాండ్ చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కేవలం 23 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నారని, 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ విద్య, ఉద్యోగాల్లో ప్రస్తుతం ఉన్న 27 శాతాన్ని పెంచుకుంటూ పోవాలని బీసీ యుద్ధభేరి ప్రధాన డిమాండ్‌గా ఉంది. అలాగే రాష్ట్ర జనాభాలో 6.8 శాతమే ఉన్న అగ్రవర్గాలకు ఈడబ్ల్యూ ఎస్ కోటా కింద ఇచ్చిన పది శాతం రిజర్వేషన్ రద్దు చేయాలని మరో డిమాండ్‌ను తెరపైకి తీసుకు వస్తున్నారు. ఈడబ్ల్యూఎస్ కోటా వల్ల బీసీ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారనే వాదనను వినిపిస్తున్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ తరహాలోనే బీసీ అట్రాసిటీ చట్టం తీసుకురావాలనే డిమాండ్‌ను తెరపైకి తెస్తున్నారు. ఇప్పటికీ బీసీలపై చిన్నచూపు చూస్తున్నారని, కులం పేరుతో వేధింపులకు గురి చేస్తున్నారని బీసీ నేతలు పేర్కొంటున్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లను కల్పించడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే ఈ 33 శాతం రిజర్వేషన్లలో బీసీ మహిళల వాటా ఎంతో తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని కోరుతున్నారు. వీటితో పాటు ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ బీసీలకు వివిధ సంక్షేమ పథకాల కోసం ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీసీ యుద్ధభేరి సభకు సిద్ధమవుతున్నారు.

నేడు లక్ష మందితో బీసీ యుద్ధభేరి

పోరాటాల గడ్డ ఓరుగల్లు నుంచి మరో ఉద్యమం ప్రారంభమవుతోంది. రాజకీయాల్లో బీసీల హక్కులు, ప్రభుత్వాలు బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలనే డిమాండ్‌తో ఆదివారం బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో బీసీ యుద్ధభేరి సభను ఏర్పాటు చేశారు. లక్ష మందికి పైగా బీసీలను తరలించాలని ప్రణాళిక రూపొందించారు. వారం, పది రోజులుగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బీసీ యుద్ధభేరిని విజయవంతం చేసేందుకు సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు.

బీసీ యుద్ధభేరికి జాతీయ నేతలు

హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు జరిగే సదస్సుకు పొలిటికల్ జేఏసీ కన్వీనర్ సుందరాజ్ యాదవ్ నేతృత్వం వహిస్తుండగా, బిహార్ మాజీ సీఎం లాలూప్రసాద్ యాదవ్ కుమార్తె, ఎంపీ మీసా భారతి, బీసీ ఉద్యమ నేతల బీపీ మండల్ మనుమడు సూరజ్ మండల్, డీఎంకే ఎంపీ విల్సన్‌తో పాటు సమాజ్‌వాదీ పార్టీ నేత ధర్మేంద్రయాదవ్ తదితరులను ఈ సభకు రప్పిస్తున్నారు. తెలంగాణ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్సీలు తీన్మార్ మల్లన్న, బస్వరాజు సారయ్య, బీఆర్ ఎస్ నేత, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, బీజేపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యలతో పాటు మరికొంత మంది బీసీ నేతలను సభకు ఆహ్వా నిస్తున్నారు. తెలంగాణలో జరుగుతున్న బీసీ యుద్ధభేరికి జాతీయ నేతలను ఆహ్వానించటం ద్వారా జాతీయ మీడియా దృష్టికి బీసీ ఉద్యమాన్ని తీసుకెళ్లే అవకాశం లభిస్తుందని భావిస్తున్నారు.

సభకు ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు


55.85% బీసీలు!

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించిన వివరాలతో నివేదికను రూపొందించారు. సమగ్ర కుల సర్వే వివరాల నివేదికను ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు మంత్రివర్గ ఉపసంఘానికి అధికారులు అందజేయనున్నారు. ఆ నివేదికపై ఉపసంఘం అధ్యయనం చేయనుంది. 5న రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. ఆ సమావేశంలో బీసీ రిజర్వేషన్లపై చర్చించి, నిర్ణయం తీసుకోనున్నారు. అదే రోజు మధ్యాహ్నం ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి, బీసీల రిజర్వేషన్లపై ఒక తీర్మానం చేసి.. దాన్ని కేంద్రానికి పంపనున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచుతామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఆ మేరకు బీసీల రిజర్వేషన్లను పెంచేందుకు సర్కారు కసరత్తు చేస్తోంది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ మేరకు రాష్ట్రంలో 50 శాతం రిజర్వేషన్లు మించకుండా, న్యాయపరమైన సమస్యలు లేకుండా ఉండేలా ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. కాగా, మార్చి 20 నాటికి రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలను పూర్తిచేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఆ దిశగా పంచాయతీరాజ్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపడుతున్నారు. మరోవైపు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఎన్నికల నిర్వహణకు అవసరమైన కార్యాచరణ చేపడుతోంది. కుల సర్వే నివేదిక ప్రభుత్వానికి చేరనుండడంతో ఎన్నికల అంశం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

బీసీ కమిషన్.. కుల సర్వే ఆధారంగా రిజర్వేషన్..



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, సీతక్క, రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొన్నం, సురేఖ, ఉత్తమ్, జూపల్లి, కోమటిరెడ్డి, ఎమ్ బలయ్య

తెలంగాణ ఏర్పాటైన తర్వాత అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే పేరుతో సర్వే చేపట్టింది. దాని ప్రకారం 2014లో బీసీలు 51శాతం, ఓసీలు 21, ఎస్సీలు 18, ఎస్టీలు 10 శాతం ఉన్నట్టు తేలింది. కానీ, ఈ సర్వేను అధికారికంగా విడుదల చేయలేదు. మళ్లీ 10 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఇటీవల సమగ్ర ఇంటింటి సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో కులం, మతం సహా అన్ని వివరాలను సేకరించారు. బీసీలకు స్థానిక సంస్థల్లో ఎంతమేర రిజర్వేషన్లను కల్పించాలనే అంశంపై ప్రభుత్వం ఈ సర్వేను వినియోగించుకోనుంది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో బీసీల రిజర్వేషన్ల ఖరారు కోసం సర్కారు బీసీ కమిషన్‌తో పాటు, ప్రత్యేక కమిషన్‌ను కూడా ఏర్పాటు చేసింది. ప్రత్యేక కమిషన్ కూడా బీసీల రిజర్వేషన్లపై లోతుగా అధ్యయనం చేసింది. త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు తెలిసింది. సర్వే వివరాలు, ప్రత్యేక కమిషన్ సూచనలను పరిగణనలోకి తీసుకొని.. స్థానిక ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లపై సర్కారు నిర్ణయం తీసుకోనుంది.

మంత్రులతో సీఎం భేటీ..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం అందుబాటులో ఉన్న మంత్రులు, ఉన్నతాధికారులతో కమాండ్ కంట్రోల్ సెంటర్లో భేటీ అయ్యారు. బీసీలకు రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణపై చర్చించారు. సమావేశం అనంతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ మీడియాతో మాట్లాడారు. పొన్నం మాట్లాడుతూ.. సమగ్ర కుటుంబ సర్వే, బీసీ కులగణనపై శాసనసభలో తీర్మానం చేసి, ప్రక్రియను పూర్తి చేశామని చెప్పారు. కులగణన కార్యరూపం దాల్చే అంశంపై సీఎం చర్చించారని తెలిపారు. దీంతోపాటు ఎస్సీ వర్గీకరణపై సబ్‌కమిటీ తీసుకున్న నిర్ణయాలపైనా చర్చించామన్నారు. ఈ నెల 5న సబ్ కమిటీ ఇచ్చిన నివేదికను క్యాబినెట్ ముందు పెడుతున్నారని, అదే రోజు శాసనసభలో చర్చించి ప్రజాస్వామ్య యుతంగా ముందుకు తీసుకెళతామని చెప్పారు.

వర్గీకరణపై త్వరలో నివేదిక: రాజనర్సింహ

సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన రెండు గంటల్లోనే ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో ప్రకటన చేశామని, వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. దీనిపై ఇప్పటికే సానుకూలంగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గ ఉపసంఘం వేశారన్నారు. ఉపసంఘం సూచన మేరకు ఏకసభ్య కమిషన్‌ను నియమించామని.. ఈ కమిషన్ త్వరలో నివేదిక ఇవ్వబోతోందని తెలిపారు. దానిపై మంత్రివర్గంలో చర్చించి, అసెంబ్లీలో ప్రవేశపెడతామని చెప్పారు.



జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ విజేతకు సన్మానం

కరీమాబాద్, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎలగందుల వైష్ణవి జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్ 17 బాలికల విభాగంలో నేషనల్ హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్‌లో తెలంగాణ తరపున ఆడి ప్రథమ స్థానంలో నిలిచిందని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు పుట్టా రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు శనివారం వైష్ణవిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ అనిల్, ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, రాజమౌళి, కొంగ శ్రీనివాస్, శ్రీవాణి, పోగు అశోక్, తిలక్, శైలజ, అంజూం, అనూష, గౌస్ మోహినోద్దీన్, కురణకుమారి, శేషాచారి, నారాయణ రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.


క్రీడాకారిణి వైష్ణవిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బీజేపీ అధ్యక్ష పీఠం తేలేది నేడే

మళ్లీ పాత అధ్యక్షుడికే పట్టం? ● ప్రత్యామ్నాయంగా మరో ఇద్దరి పేర్లు

మిల్స్‌కాలనీ ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్ష పీఠం ఎవరికి దక్కుతుందో ఆదివారం నాడు తేలనుంది. ఢిల్లీ పెద్దలు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు అధ్యక్షుల పేర్లను ఈ రోజు ప్రకటించనున్నారు. కాగా వరంగల్ జిల్లా అధ్యక్ష పీఠం మళ్లీ పాత అధ్యక్షుడికే దక్కనున్నట్లు తెలుస్తోంది. పాత అధ్యక్షుడు గంటా రవికుమార్ కేవలం ఒక్క సంవత్సరం మాత్రమే పదవిలో కొనసాగడంతో ఈ సారి కూడా ఆయనకే ఇవ్వాలని ఢిల్లీ పెద్దలు నిర్ణయించినట్లు సమాచారం. వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షుల ఎంపికలో అధిష్ఠానం సామాజిక వర్గాలను సమన్వయం చేసేందుకు కూర్పు చేస్తుందనే అభిప్రాయాన్ని ఇరు జిల్లాల నాయకులు, కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. హనుమకొండ జిల్లా అధ్యక్ష పదవి రెడ్డి సామాజిక వర్గానికి ఇస్తే వరంగల్ పీఠం బీసీ సామాజిక వర్గానికి కట్టబెట్టనున్నట్లు తెలుస్తోంది. అయితే వరంగల్ జిల్లా అధ్యక్షుడి పీఠం గంటా రవికుమార్‌కే దాదాపు ఖరారు అయినట్లు విశ్వసనీయ సమాచారం. సంవత్సర కాలంలో ఆయన అసెంబ్లీ, పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ ఓటు బ్యాంకు పెంచడంలో సఫలీకృతులైనట్లు అధిష్ఠానం భావిస్తోంది. ఎంపీ ఎన్నికల్లో వరంగల్ తూర్పులో బీజేపీకి అధిక ఓట్లు సాధించడంపై ఆయన కృషిని గుర్తించారు. లక్షకు పైగా సభ్యత్వాలు చేయించి రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిపిన అంశాన్ని సైతం ఢిల్లీ పెద్దలు గుర్తించి ఆయనకే ఈ సారి అధ్యక్ష పీఠం ఖరారు చేశారని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

ఇక అనూహ్య సంఘటనలు ఏవైనా ఎదురైతే మరో ఇద్దరు పేర్లను సైతం అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో బీసీ వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ తనయుడు డాక్టర్ వన్నాల వెంకటరమణతో పాటు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన మల్లాడి తిరుపతిరెడ్డి పేరు ఉన్నట్లు తెలుస్తోంది. హనుమకొండ జిల్లా అధ్యక్ష పీఠం బీసీ వర్గానికి కట్టబెడితే వరంగల్‌కు తిరుపతిరెడ్డిని ప్రకటించే అవకాశం లేకపోలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక జిల్లాలోని సీనియర్ నాయకులు బలపరుస్తున్న డాక్టర్ వెంకటరమణ అధ్యక్షుడి రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ఏవైనా అనూహ్యమైన కారణాలతో గంటా రవికుమార్‌ను, తిరుపతిరెడ్డిని అధిష్ఠానం పక్కనబెడితే అధ్యక్ష పీఠం వెంకటరమణకు దక్కే అవకాశం ఉంది.

ఏఐఎస్ఎఫ్ కరపత్రాల ఆవిష్కరణ



శివనగర్‌లో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శరత్ తదితరులు

ఖిలావరంగల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఈ నెల 9,10 తేదీలలో హైదరాబాద్‌లో నిర్వహించే అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జాతీయ సమితి సమావేశాలను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదళ్ల శరత్ కోరారు. శనివారం శివనగర్‌లోని తమ్మెరభవన్‌లో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నూతన విద్యా విధానం, విద్యార్థి హక్కులు వంటి అంశాలపై జాతీయ స్థాయిలో చర్చించేందుకు ఈ సమావేశాలు వేదికగా నిలుస్తాయన్నారు. విద్యార్థులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి హరీష్, నాయకులు సాగర్, శివ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

బీసీ యుద్ధభేరిని జయప్రదం చేయాలి

ఖిలావరంగల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలు కోసం హనుమకొండ ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించే బీసీ రాజకీయ మహాసభను విజయవంతం చేయాలని బీసీ రైటర్స్ వింగ్ చైర్మన్ ప్రొఫెసర్ చింతం ప్రవీణ్, ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ పిలుపునిచ్చారు. జనవరి 19న జనగామ జిల్లా ఖిలాషాపూర్‌లో ప్రారంభమైన బీసీ ఆజాది సైకిల్ యాత్రకు శనివారం ఖిలావరంగల్ అమరవీరుల స్థూపం వద్ద విరామం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనాభా దామాషా ప్రకారం బీసీలకు అన్ని రంగాల్లో వాటా దక్కాలని, స్థానిక సంస్థ ల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సైకిల్ యాత్రకు నాయకత్వం వహిస్తున్న ఉద్యమకారులు సిద్దుల సిద్ధేశ్వర్, చాపర్తి కుమార్ మాట్లాడుతూ.. చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ల కోసం గత పార్లమెంట్ ఎన్నికలకు ముందు 400 కిలోమీటర్లు పాదయాత్ర చేసి ఖిలాషాపూర్‌లో విరామం ప్రకటించామన్నారు. బీసీల గొంతుకగా ముందుకు వస్తున్న తీన్మార్ మల్లన్నకు బీసీ సమాజం అండగా నిలవాలన్నారు. ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌ల వల్ల బీసీలకు అన్యాయం జరుగుతోందని, వాటిని తీసుకువచ్చిన బీజేపీ ప్రభుత్వాన్ని, అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు.


మహాత్మా జ్యోతిబా పూలే పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం నాయకులు

ఈ కార్యక్రమంలో సూరం రవీందర్, కొంగర వీరస్వామి, భీమగాని సౌజన్య, ఏదునూరి రాజమౌళి, సోమ రామమూర్తి, మాదం నరేష్, బుసిగొండ ఓంకార్, చిలువేరు రాంచందర్, సూరం నిరంజన్, సింగారపు అరుణ, కొనతం కృష్ణ, పెండెం సంపత్, జంగిలి శ్రీనివాస్, మండల పరశురాములు, ధర్మపురి రాజగోవింద్, సాగర్ల శ్రీనివాస్, పుప్పాల రాజు, చింతం అమర్‌వర్మ, బొలుగొడ్డు శ్రీనివాస్, వేణు, రాజ్‌కుమార్, తిరుపతి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన అధికారులు

కాశిబుగ్గ డీసీగా ప్రసన్నరెడ్డి, టీవోగా రామకృష్ణ


ప్రసన్నరెడ్డి


రామకృష్ణ

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఇటీవల ఉన్నతాధికారులు బదిలీ ఐన విషయం తెలిసిందే. కాగా, రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిశోర్ వరంగల్ బల్దియా నుంచి ఇద్దరిని బదిలీ చేసి ఇద్దరికి పోస్టింగ్ ఇచ్చారు. బల్దియాకు వచ్చిన అధికారులు శనివారం విధుల్లో చేరారు. కాశిబుగ్గ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా ప్రసన్నరెడ్డి బాధ్యతలు స్వీకరించగా, బల్దియా టాక్సీల విభాగం అధికారిగా వై.రామకృష్ణ విధుల్లో చేరారు. వీరు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. కొత్తగా విధుల్లో చేరిన అధికారులను అక్కడి సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అపరిశుభ్ర హోటళ్లకు జరిమానా

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో అపరిశుభ్ర పరిస్థితిలో హోటళ్లు నిర్వహిస్తున్న నిర్వాహకులకు శనివారం రూ.60 వేల జరిమానా విధించినట్లు బల్దియా సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ.. కేయూసీ రెండో గేటు సమీపంలోని కనుకయ్య హోటల్, రెడ్డి హోటళ్ల నిర్వాహకులు సరైన హైజిన్ పద్ధతులు పాటించడం లేదని ఫిర్యాదులు అందాయన్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఆకస్మికంగా తనిఖీలు చేసినట్టు తెలిపారు. ప్రధానంగా వంట గది, మూత్రశాలలు సరిగా లేవని వర్కర్లకు పీపీఈ కిట్లు లేవు, ఫైర్ సేఫ్టీ లేకపోవడం, హోటల్ ఆవరణ అపరిశుభ్రతతో ఉంది. ఇంకా డ్రైనేజీ ఔట్‌లెట్ సరిగా లేకపోవడం, జాలి అమర్చకపోవడం వల్ల జరిమానా విధించినట్లు వెల్లడించారు. కనుకయ్య హోటర్ నిర్వాహకులకు రూ.50వేలు, రెడ్డి హోటర్ నిర్వాహకులకు రూ.10వేల జరిమానా విధించామన్నారు. ఈ తనిఖీలో శానిటరీ సూపర్‌వైజర్ నరేంద్ర వర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సంపత్‌రెడ్డి, అనిల్, శ్రీనివాస్‌లతో పాటు శానిటరీ జవాన్లు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


మృతి చెందిన రాజేందర్

కరీమాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పిల్లలు కలగడంలేదన్న మనస్తాపంతో ఓ వ్యక్తి శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. మిల్స్‌కాలనీ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉర్సు ప్రాంతానికి చెందిన వంగాల రాజేందర్ (45)కు వివాహమై పదిహేనేళ్లయినా సంతానం కలగలేదు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. శనివారం మధ్యాహ్నం మద్యం సేవించి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. సంతానం లేకపోవడంతో పాటు ఆర్థిక సమస్యలతో మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. భార్య వంగాల స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీకాంత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం

రంగశాయిపేటలో వైభవంగా వేడుకలు


బొడ్రాయికి పూజలు చేస్తున్న ఆర్‌వైఎఫ్ బాధ్యులు

శంభునిపేట, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): వరంగల్ రంగశాయిపేటలో శనివారం గ్రామ దేవత ప్రథమ వార్షిక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ కన్వీనర్లు గుండు పూర్ణచందర్, కొల్లూరి యోగానంద్, కేడల జనార్ధన్ వేడుకలను ప్రారంభించారు. రంగశాయిపేట యూత్ ఫోర్స్(ఆర్‌వైఎఫ్), ఉత్సవ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో రంగశాయిపేటలోని నెహ్రూ కూడలి వద్ద, అదే విధంగా గ్రామంలోని రామాలయం వద్ద గల బొడ్రాయిలకు ఉదయం నుంచి మహిళలు జలాభిషేకాలు చేశారు. బొడ్రాయి ఆవరణలో దంపతులచే సామూహిక హోమ కార్యక్రమాలు నిర్వహించారు. పురోహితులు వెలిదే నరసింహమూర్తి, వెలిదే ప్రభాకర శాస్త్రీ, వెలిదే భార్గవ శర్మ, వెలిదే ప్రదీప్ శాస్త్రి ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పోశాల పద్మస్వామి, శేర్ల అనిల్‌కుమార్, కర్నె రవీందర్, తాళ్లపల్లి అర్జున్‌గౌడ్, మంతెన సునిత, బజ్జూరి విరేశం, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో భక్తులు, పాల్గొన్నారు.

నేడు బోనాల జాతర....

ఉత్సవాలలో భాగంగా ఆదివారం రంగశాయిపేటలో బొడ్రాయి దేవతలకు గ్రామస్థులు బోనాలు సమర్పించనున్నారు. వందల సంఖ్యలో భక్తులు బోనాలతో తరలివచ్చే అవకాశం ఉన్నందున ఆర్‌వైఎఫ్ బాధ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

కార్మిక చట్టాలను రద్దు చేయాలి

ఏఐసీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాండురంగాచారి

గిర్మాజీపేట,ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన 4 కార్మిక చట్టాలను వెంటనే రద్దు చేయాలని ఏఐసీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.పాండురంగాచారి డిమాండ్ చేశారు. శనివారం వరంగల్ అండర్‌బ్రిడ్జి సమీపంలోని ఎంసీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరిస్తున్నారని, కార్పొరేట్ వర్గాలకు అప్పనంగా అప్పగిస్తున్నాడని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కార్మిక సంక్షేమ బోర్డు ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర చట్టం చేయాలని, కార్మిక సంక్షేమ బోర్డును ప్రభుత్వ ఆధీనంలోనే ఉండేలా చూడాలని కోరారు. ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి చుంచు జగదీశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నర్రా ప్రతాప్, జిల్లా ఇన్‌చార్జి గోనె కుమారస్వామి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎం.డి.మాసూక్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎం.భద్రయ్య, కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, కోశాధికారి కె.ఇంద్రారెడ్డి, కమిటీ సభ్యులు ఎం.మొగిలి, ఎన్.రవి, నగేష్, ప్రభాకర్, నరసయ్య, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాండురంగాచారి

గుండెపోటుతో వృద్ధుడి మృతి

గిర్మాజీపేట,ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): వరంగల్ రైల్వేస్టేషన్‌లో శనివారం గుండెపోటుతో ఓ వృద్ధుడు మృతిచెందాడు. వరంగల్ జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఎస్‌ఆర్‌ఆర్ తోట ప్రాంతానికి చెందిన మంద నరసయ్య(74) చింతల్‌పల్లిలో ఉన్న కుమారుడు ప్రకాష్ వద్దకు పుష్‌పుల్ రైల్లో వెళ్లేందుకు ఉదయం వరంగల్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. టికెట్ కొనేందుకు కౌంటర్ వద్దకు వెళ్తుండగా అకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఆయనను పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లుగా నిర్ధారించారు. హెడ్‌కానిస్టేబుల్ పి.రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎగ్ కార్ట్స్ పంపిణీ


ఎగ్ కార్ట్స్ అందుకుంటున్న లబ్ధిదారులు

కాశిబుగ్గ, ఫిబ్రవరి01 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఈసీసీ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఎగ్ కార్ట్స్‌ను అందించారు. ఎర్రబెల్లి ప్రదీప్ రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి వినీత్‌రావు, తాబేటి వెంకట్, ఐలు నాగరాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సరుకుల పంపిణీ


లింగంపల్లిలో వృద్ధురాలికి సరుకులు అందజేస్తున్న హిందూ సేవా సమితి సభ్యులు

కరీమాబాద్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): సనాతన హిందూసేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఇద్దరు దివ్యాంగులకు నిత్యావసర సరుకులను అందజేశారు. జనగామ జిల్లా చిలుపూర్ మండలం లింగంపల్లి గ్రామంలో అంధురాలైన అరకల శాంతమ్మతో పాటు అదే మండలంలోని కుమ్మగుట్టలో వికలాంగుడైన వల్లాల రత్నాకర్‌కు రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో తాళ్లపెల్లి నగేష్, మిట్టపెల్లి వేణు, ప్రతాపగిరి గణేష్, జంగిటి చందు, శ్రీకాంత్, జంగిటి వేణు, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మార్కండేయ జయంతి


కాశిబుగ్గలో మార్కండేయ జయంతిలో పాల్గొన్న పద్మశాలీలు


పోచమ్మమైదాన్ చౌరస్తాలో పద్మశాలి సంఘం ప్రతినిధులు

కాశిబుగ్గ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అఖిల భారత పద్మశాలి, కాశిబుగ్గ మిత్ర మండలి ఆధ్వర్యంలో శనివారం శ్రీ భక్త మార్కండేయ జయంతి పూజా కార్యక్రమాల్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నేతలు గుండు ప్రభాకర్, ఆడెపు రవీందర్, సమ్మారావు, కార్పొరేటర్ గుండేటి నరేందర్, వద్నాల నరేందర్, బయ్యా స్వామి, గుల్లపల్లి రాజ్‌కుమార్, మనోహర్, వేముల నాగరాజు, రాంప్రసాద్, అకెన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సేవా సంఘం ట్రస్ట్ భవనంలో జరిగిన మార్కండేయ జయంతిలో ట్రస్ట్ అధ్యక్షుడు సుంకనపల్లి శ్రీనివాస్, సుధాకర్, రాజు, అకెన వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ, దశరథం, నాగరాజు, మహేష్, ప్రభాకర్, మల్లేషం పాల్గొన్నారు.

● పోచమ్మమైదాన్: వరంగల్ పోచమ్మమైదాన్ చౌరస్తాలో శనివారం జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శ్రీ భక్తమార్కండేయ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శ్రీ భక్తమార్కండేయ చిత్ర పటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పేదలకు పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు లయన్ డాక్టర్ అడెపు రవీందర్, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ వద్నాల నరేందర్, రాష్ట్ర నాయకులు గుండు ప్రభాకర్, సాంబారి సమ్మారావు, డీఎస్ మూర్తి, గౌరవ అధ్యక్షుడు కుసుమ సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోరంటల రాజు, చిప్ప వెంకటేశ్వర్లు, బాసాని శ్రీనివాస్, బైరి శ్యాంసుందర్, బేతి అశోక్‌బాబు, గోపికొండ సుధాకర్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మహాసభను విజయవంతం చేయాలి

ఖిలావరంగల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీల వర్గీకరణ కోసం ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు, వేల గొంతుకల మహాసభను విజయవంతం చేయాలని మాదిగ ఆటోయూనియన్ నాయకులు పిలుపు నిచ్చారు. శనివారం ఖిలావరంగల్ వాకింగ్ గ్రౌండ్‌లో 100 మంది ఆటో డ్రైవర్లు డప్పు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ(మాదిగ)బిడ్డలందరూ మహాసభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు ఈసంపెల్లి సంజీవ, మడికొండ బాబు, కలకోట్ల విజయ్, సింగారపు రాము, వీరెల్లి కుమార్, కలకోట్ల విజయ్, గబ్బెట కుమారస్వామి, భాస్కర్, వస్కుల రాజు, జన్ను నరసయ్య, వెల్దండి కుమార్, కొమ్ము బాబు, కొత్తూర్ శ్రీను, ఇసంపెల్లి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.


ఖిలావరంగల్‌లో డప్పు కళాకారుల ప్రదర్శన

● వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

కాశిబుగ్గ: ఈ నెల 7న హైదరాబాద్‌లో జరిగే మహాసభ వాల్‌పోస్టర్లను శనివారం కాశిబుగ్గ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నేతలు ఆవిష్కరించారు. మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీర్ల మహేందర్, చాతాళ్ల రమేశ్, గోపాల్, ధర్మన్న, సుధాకర్, పూర్ణయ్య, దేవిప్రసాద్, కిషోర్, శ్యాం, ప్రవీణ్, రాజు, చందు తదితరులు పాల్గొన్నారు.

వల్లూరి రామచంద్రం సమర్థతకు గుర్తింపు: మిట్టపల్లి


రిజిస్ట్రార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మిట్టపల్లి సురేందర్

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీకి సమర్థుడైన దళిత ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంకు రిజిస్ట్రార్‌గా అవకాశం కల్పించి సరైన గుర్తింపు కల్పించారని ప్రముఖ సినీ గేయ రచయిత మిట్టపల్లి సురేందర్, ఆల్ ఇండియా వర్సిటీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్ అన్నారు. శనివారం కేయూ పరిపాలన భవనం కేయూ కొత్త రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంను కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

● అభినందనల వెల్లువ

కేయూ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంను శనివారం ఆయన చాంబర్‌లో ఇల్లందుల మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, అఖిల భారత ఐక్యవేదిక రైతు సంఘం (ఏఐయూకేఎస్)రాష్ట్ర సహాయ కార్యదర్శి చంద్రన్న, రాష్ట్ర నాయకులు జగ్గన్న తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

● కేయూలో సంబురాలు..

కేయూ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మాదిగ స్టూడెంట్స్ యూని యన్ నేతలు బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుని సంబురాలు జరుపుకున్నారు.

కలెక్టరేట్ ఎదుట హమాలి కార్మికుల ధర్నా

హనుమకొండ కలెక్టరేట్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం హమాలీ కార్మికులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐ టీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, ఆల్ హమాలీ వర్కర్స్ యూనియ న్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల చక్రపాణి మాట్లాడుతూ.. జిల్లాలో వివిధ రంగాలలో పని చేస్తున్న 8వేల మంది హమాలీ కార్మికులకు బతుకుభారం అవుతుందని, కష్టాల కడలిలో ఉన్న కార్మికుల సమస్యలు వెంటనే పరిష్క రించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి అందజేశారు. ధర్నాలో పెద్ద సంఖ్య లో హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, డైరెక్టర్లకు సన్మానం


బండి జనార్దన్‌ను సన్మానిస్తున్న గుమస్తాల సంఘం నాయకులు

ఖిలావరంగల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల వరంగల్ వ్యవసాయ మార్కెట్ వైస్‌చైర్మన్‌గా నియమితులైన బండి జనార్దన్, డైరెక్టర్‌గా నియమితులైన గజ్జెల శ్యామ్‌సుందర్‌ను శనివారం గుమస్తాల సంఘం నాయకులు సన్మానించారు. రైతులు, గుమస్తాలు, కార్మికులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఇనుముల మల్లేశం, చైర్మన్ ఇనుముల మల్లేశం, ప్రధాన కార్యదర్శి సులుగం గోపాల్, గౌరవ అధ్యక్షుడు పుప్పాల రాజేందర్, ఉపాధ్యక్షుడు ముత్తినేని శ్రీనివాస్, దామెరకొండ కరుణాకర్, వెంకన్న, మంద దేవేందర్, మండాటి శ్రీధర్‌పటేల్, సదానందం, వైకుంఠం, విజయ్, వేణు, మురళీ, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆరె కటిక జాతర పోస్టర్ల ఆవిష్కరణ


జాతర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆరెకటిక సంఘం జిల్లా నాయకులు

కరీమాబాద్, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతరపురం జిల్లా గుత్తి పట్టణంలో వెలసిన అఖిల భారత ఆరెకటిక కులస్థుల కులదేవతలు సునామ జకినీమాత, శ్రీ మల్లామ జకినీమాత జాతర ఆహ్వాన పత్రికలను శనివారం ఆరెకటిక సంఘం జిల్లా నాయకులు ఆవిష్కరించారు. కరీమాబాద్‌లోని జిల్లా కార్యాలయంలో ఆరెకటిక సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు, జాతర తెలంగాణ ప్రచార కార్యదర్శి గోగికార్ రవీందర్ మాట్లాడుతూ.. ఈ నెల 6,7 తేదీల్లో జరిగే ఈ జాతరను విజయవంతం చేయాలని, ఆయ రాష్ట్రాల నుంచి ఆరెకటిక కులస్థులు జాతరకు వచ్చి అమ్మవార్ల దీవెనలు పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టింగిలికార్ సురేష్, నామతబాద్ కిషన్, శివాజీ, మరార్‌కార్ శ్రీనివాస్, టింగిలికార్ శివరాజు టింగిలికార్ సతీష్, గోగికార్ నాగరాజు, శ్యాంబాబు, కిషోర్, వాన్‌కార్ రవి, అగల్‌దిటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కొంత ఎక్కువ.. ఎంతో తక్కువ..



- మిశ్రమంగా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్
- దీర్ఘకాలిక ప్రాజెక్టులకు కానరాని మోక్షం
- కొన్ని పనులకు నిధుల కేటాయింపు
- విమానాశ్రయం, లెదర్ పార్కు ఏర్పాటు దిశగా అడుగులు
- జిల్లాకో కేన్సర్ ఆస్పత్రి ప్రకటనతో ప్రయోజనం
- చిన్నపరిశ్రమలు, స్టార్టప్‌లకు చేయూత
- ఆదాయం పన్ను పరిమితి పెంపుతో హర్షం
- కిసాన్ కార్డు రుణ పరిమితి పెంపుతో ఆనందం
- అసంఘటిత కార్మికులకు వైద్య భరోసా
- నిర్మలమ్మ కేంద్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

మోదం

- మామునూరు విమానాశ్రయం
- లెదర్ పార్కు
- చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు
- రూ.12లక్షల వరకు పన్ను మినహాయింపు
- కిసాన్ క్రెడిట్ కార్డు రుణ పరిమితి పెంపు
- ఆరు జిల్లాల్లో కేన్సర్ ఆస్పత్రుల ఏర్పాటు
- అసంఘటిత కార్మికులకు వైద్య భరోసా

ఖేదం..

- కాజీపేట రైల్వే డివిజన్ ప్రస్తావన కరువు
- కొత్త రైల్వే మార్గాల ఊసే లేదు..
- సైనిక్ స్కూల్ మాటే లేదు..
- కానరాని గిరిజన విశ్వవిద్యాలయం
- మెగా టెక్స్‌టైల్ పార్కుకు నిధులు లేవు
- మేడారం జాతరకు జాతీయ హోదా లేదు
- బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ముచ్చటే లేదు

కేంద్ర బడ్జెట్ - 2025 ఉమ్మడి వరంగల్ జిల్లాకు కొంత మోదం.. కొంత ఖేదం కలిగించింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఓరుగల్లు ప్రజలకు పెద్దగా వరాలను ఏమీ కురిపించలేదు. కొన్ని ప్రతిపాదిత పథకాలకు నిధులను కేటాయించి సంతోషపెట్టారు. అయితే దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను ప్రస్తావించలేదు. నిధులూ కేటాయించలేదు. రైల్వే పరంగా కొత్త లైన్లు, ప్రాజెక్టులు ప్రకటించలేదు. ఏళ్ల కల అయిన కాజీపేట రైల్వే డివిజన్ ప్రస్తావన లేదు. కోచ్ ఫ్యాక్టరీకి మాత్రం నిధులు ఇచ్చారు. ఇక మెగా టెక్స్‌టైల్ పార్కుకు నిధుల ఊసేలేదు. అలాగే మేడారం జాతరకు జాతీయ హోదా దక్కలేదు. బయ్యారం ఉక్కుఫ్యాక్టరీ ముచ్చటే లేదు. అయితే పేద, మధ్య తరగతి వర్గాలకు మాత్రం కేంద్రం వరాలను కురిపించింది. రైతులకు పెద్ద పీట వేసింది. చిన్న, మధ్య తరహా పరిశ్రమల వృద్ధికి చేయూతనిచ్చింది. ప్రధానంగా ఆదాయం పన్ను విషయంలో భారీ ఊరటను కల్పించింది. రూ.12లక్షల మేర ఆదాయం వరకు పన్నును మినహాయించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో సుమారు 18 లక్షల మంది మధ్యతరగతి వారికి లబ్ధి కలుగనున్నది. విమానాశ్రయాలను అభివృద్ధి చేస్తామనే ప్రకటతో మామునూరు ఎయిర్‌పోర్టుకు అడుగులు పడనున్నాయి. చిన్న పరిశ్రమలకు రాయితీ ప్రకటనతో పరిశ్రమల ఏర్పాటుకు పూల బాట పడనుంది. అలాగే జిల్లాకో కేన్సర్ ఆస్పత్రి ఏర్పాటుతో ఉమ్మడి జిల్లాలో ఆరు ఆస్పత్రులు నిర్మించనున్నారు. అసంఘటిత కార్మికులకు కేంద్రం శుభవార్త చెప్పింది. హెల్త్ కార్డులు అందించి యేటా రూ.5లక్షల వరకు ఆరోగ్య సదుపాయం కల్పించింది. మొత్తంగా కేంద్ర బడ్జెట్ ఉమ్మడి జిల్లా ప్రజలకు కొంత ఆశాజనకంగా ఉన్నట్లు ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

- హనుమకొండ, ఆంధ్రజ్యోతి

వివరాలు : 8 లో..

గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయండి

- కుడా వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడే



మ్యూజికల్ గార్డెన్‌లో పరిసరాలు పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నిర్దేశిత గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలని బల్దియా కమిషనర్, కుడా వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. శనివారం కుడా ఆధ్వర్యంలో కాకతీయ మూజికల్ గార్డెన్స్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. అక్కడ జరుగుతున్న పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ.. గార్డెన్‌లోని పిల్లల పార్కులో గతంలో ఏర్పాటు చేసిన పరికరాలు, ఆట వస్తువులు దెబ్బతింటే వెంటనే వారికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని సూచించారు. క్యాంటీన్ ముందు భాగంలో గ్రీనరీ ఏర్పాటు చేయాలన్నారు. గార్డెన్ ప్రాంతం నుంచి నాలా వెలుతున్నందున చెత్తా చెదారం రాకుండా ఉండడానికి గార్డెన్ ముందు వైపు జాలి ఏర్పాటు చేయాలన్నారు. నిర్మాణ సంబంధ అన్ని పనులు మార్చి చివరి వారం వరకు పూర్తి చేయాలన్నారు. భద్రకాళి బండ్‌లో పూడిక తీత (డిస్ట్రిలింగ్) ప్రాంతాన్ని వైస్ చైర్మన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కుడా సీపీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావుతో పాటు కుడా అధికారులు పాల్గొన్నారు.

సోనియా వ్యాఖ్యలు దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం

బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర నాయకుడు మాను నాయక్



అమరవీరుల స్థూపం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ ఎస్టీ మోర్చా నాయకులు

రాంనగర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రపతి ద్రౌపది ముర్ముపై సోనియాగాంధీ చేసిన వ్యాఖ్యలు ఆమె దిగజారుడు రాజకీయాలకు నిదర్శమని బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర నాయకుడు మాను నాయక్ అన్నారు. ద్రౌపది ముర్ముపై సోనియాగాంధీ వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం హనుమకొండ అమరవీరుల స్థూపం వద్ద ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతి ఆధ్వర్యంలో సోనియాగాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు రాగా, సుబేదారి పోలీసుల అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు నాను నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్రపతిపై అహంకార వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమే అన్నారు. సోనియా వ్యాఖ్యలు భారతీయ మనోభావాలను దెబ్బతీశాయన్నారు. కాంగ్రెస్ వైఖరిని మహిళా సమాజం, దేశ ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యాన్ని అవమానించిన సోనియాగాంధీ వెంటనే క్షమాణలు చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గణేశ్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, 61వ డివిజన్ అధ్యక్షుడు లావుడ్య రఘు, నవీన్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో ఆదివారం జరగనున్న బీసీ యుద్ధభేరి సభకు సిద్ధమవుతున్న ప్రాంగణం



కోటా కోసం కొట్లాట!

నేడు ఓరుగల్లులో బీసీ జంగ్ సైరన్

- ఆర్ట్స్ కాలేజీలో లక్ష మందితో బీసీ యుద్ధభేరి
- పార్టీలకు అతీతంగా ఏకమవుతున్న ప్రజాప్రతినిధులు
- కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం 42శాతం రిజర్వేషన్ కోసం డిమాండ్
- ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ల రద్దు, మహిళ రిజర్వేషన్లలో బీసీల వాటా
- బీసీ కోటా తేలాకే స్థానిక ఎన్నికలు పెట్టాలని డిమాండ్
- బీసీ యుద్ధభేరికి జాతీయ నేతలను ఆహ్వానించిన నిర్వాహకులు

8

ఆపరేషన్ స్మైల్ ద్వారా 161మంది చిన్నారులకు విముక్తి

- వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ స్మైల్ ద్వారా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 161 మంది చిన్నారుల విముక్తి కలిగించినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ పేర్కొన్నారు. జనవరి మొదటి తారీఖు నుంచి నెలాఖరు వరకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో వరంగల్ పోలీస్ కమిషనరేట్ బలగాలు, బాలల సంరక్షణ విభాగం, చైల్డ్‌లైన్, కార్మికశాఖతో కలిసి హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల్లో సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో బాల కార్మికుల, బడి మానేసిన 161 మంది బాలబాలికలను గుర్తించి వారిని బాలల సంరక్షణ గృహానికి తరలించామన్నారు. వీరిలో 137 మంది బాలలు, 24 మంది బాలికలు ఉన్నారన్నారు. బాలల సంరక్షణ గృహానికి తరలించిన వారిలో తెలంగాణకు చెందిన వారు 92, ఇతర రాష్ట్రాలకు చెందిన వారు 69 మంది ఉన్నారన్నారు. చిన్నారులతో పనిచేయించుకున్న ఏడుగురు యాజమానులపై కేసు నమోదు చేశామన్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన బాలికను దర్పణ్ యాప్ ద్వారా గుర్తించి తల్లితండ్రులకు అప్పగించామన్నారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, చిన్నారులను పనిలో పెట్టుకునే యజమానులకు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.50వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

శాసన మండలి ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- ఎన్నికల ప్రవర్తనా నియామవళి పకడ్బందీగా అమలు చేయాలి
- వీసీలో కలెక్టర్లతో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి



వీసీలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి



హనుమకొండ కలెక్టరేట్ నుంచి వీసీలో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య, ఇతర అధికారులు

హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): శాసన మండలి సభ్యుల ఎన్నికలు సజావుగా జరిగేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి సుదర్శన్‌రెడ్డి టీచర్స్ ఎమ్మెల్సీ స్థానం ఎన్నికలపై ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మా ట్లాడుతూ.. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వ రంగల్ ఉపాధ్యాయుల స్థానానికి ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిన నేప థ్యంలో ఎన్నికలు జరిగే జిల్లాల వ్యాప్తంగా ఎన్నికల నియా మవళి కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. 24 గంటలు, 48 గంటలు, 72 గంటలలో తీసుకోవాల్సిన చర్యలపై రిపోర్టు అందించాలన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించి నోటిఫికేషన్ ఫిబ్రవరి 3న విడుదల చేస్తామని, ఫిబ్రవరి 3 నుంచి ఫిబ్రవరి 10వరకు నామినేషన్ల స్వీకరణ, 11న స్ర్కూటినీ, 13లోపు ఉపసంహరణ గడువు ఉంటుందని, ఫిబ్రవరి 27న పోలింగ్ జరుగుతుందని, మార్చి 3న ఫలితాలు ఉంటాయన్నారు. హనుమకొండ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాలో ఉపాధ్యాయులకు సంబంధించి 24 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించిన నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాలో 13 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సహకరించాలి

- రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరిన కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ, ఖమ్మం, వరంగల్ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ కోరారు. శనివారం వరంగల్ కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 3 నుంచి 10 వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, 11న స్ర్కూటినీ, 13న ఉపసంహరణ ఉంటుందని అన్నారు. ఈ నెల 27వ తేదీన ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. మార్చి 3న నల్లగొండ జిల్లాలో ఓట్లను లెక్కిస్తారని తెలిపారు. వరంగల్ జిల్లాలో మొత్తం 13 పోలింగ్ కేంద్రాలను ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌వో విజయలక్ష్మీ, ఎలక్షన్ డీటీ రంజిత్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎండి.నేహాల్, హరిశంకర్, అనిల్ కుమార్, కుసుమ శ్యాంసుందర్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

రానున్న పంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని 317గ్రామ పంచాయతీలు ఉన్నాయని, వాటిలో సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం అర్హులను ఎంపిక చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీపీవో కల్పన, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, హౌసింగ్ పీడీ గణపతి, ఎంపీడీవోలు, ఎంపీవోలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

భారీగా గుట్కాల పట్టివేత

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీసు కమిషరేట్ పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న గుట్కాలను పట్టుకొని సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. నర్సంపేట పీఎస్ పరిధిలో సాయినగర్‌కు చెందిన సంతోషిమాత కిరాణం నిర్వాహకుడు మల్యాల మధు నుంచి రూ.5,550 విలువ చేసే గుట్కాలు, పాఖాల రోడ్డులో కొలరియా విజయ్ నుంచి రూ.7,800 విలువ చేసే గుట్కాలు, మల్యాల సదానందం నుంచి రూ.26,200 గుట్కాలు, వల్లభ్‌నగర్‌లోని శ్రీకాంత్ నుంచి రూ.91,600 గుట్కాలను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. అదే విధంగా మిల్స్‌కాలనీ పరిధిలో శివనగర్‌కు చెందిన కొంతం చంద్రయ్య నుంచి రూ.14,560 విలువ చేసే గుట్కాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఐనవోలు పీఎస్ పరిధిలో పీడీఎస్ రైస్ తరలిస్తుండగా ఆటో సీజ్‌చేసి రూ.15,000 విలువ చేసే 6క్వింటాళ్ల రైస్‌ను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా మిల్స్‌కాలనీ పీఎస్ పరిధిలో 14 క్వింటాళ్ల రైస్‌ను పట్టుకున్నట్లు ఏసీపీ మధుసూదన్ తెలిపారు.



ఆంధ్రజ్యోతి

WWW.ANDHRAJYOTHY.COM

వరంగల్ రూరల్

WARANGAL RURAL

ఆదివారం 2 ఫిబ్రవరి 2025

10

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

పారా అథ్లెటిక్స్‌లో దేవాకు బంగారు పతకాలు

జాతీయస్థాయి చాంపియన్ షిప్‌కు ఎంపిక

నెక్కొండ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బొల్లికొండ గ్రామానికి చెందిన నునావత్ దేవా రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీల్లో అత్యంత ప్రతిభ చూపి రెండు బంగారు, ఒక కాంస్య పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక య్యాడని తెలంగాణ పారా అథ్లెటిక్స్ అధ్యక్షకార్యదర్శులు శేఖర్ విస్లావత్, ప్రశాంత్ శనివారం తెలిపారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో జనవరి 28వ తేదిన నిర్వహించిన తెలంగాణ ఏడో రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్‌లో నునావత్ దేవా పలు క్రీడల్లో పాల్గొన్నాడు. జావలిన్ త్రో, డిస్కస్ త్రో పోటీల్లో అత్యంత ప్రతిభచూపి రెండు బంగారు పతకాలు, లాంగ్ జంప్‌లో ఒక కాంస్య పతకం సాధించారు. ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకూ తమిళనాడులోని చెన్నై పట్టణంలో జరగబోయే 23వ జాతీయస్థాయి పారా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ క్రీడలకు దేవా ఎంపికయ్యాడన్నారు. భవిష్యత్తులో దేవా జాతీయ స్థాయిల్లో అత్యధిక బంగారు పతకాలను సాధించి దేశానికి మంచి పేరు తెస్తాడంటూ వారు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.



పతకాలను సాధించిన దేవా

కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం



కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్ శక్తులకు భరోసానిచ్చేలా, ప్రజల నడ్డివిరిచేలా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ప్రతులను సీపీఎం ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో దహనం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడు శోభన్‌బాబునాయక్, సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు కాసు మాధవి మాట్లాడారు. కేంద్రం తమ రాజకీయ అవసరాల కోసమే బడ్జెట్ రూపొందించారే తప్ప దేశ సమ్మిళితవృద్ధిని ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం పదే పదే వల్లెవేస్తున్న వికసిత్ భారత్ ఇలాంటి బడ్జెట్‌లతో సాధ్యమవుతుందా అని పునర్ సమీక్షించుకోవాలని డిమాండ్ చేశారు. దేశమంటే కొన్ని రాష్ట్రాలే అన్నట్లుగా నిర్మల సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టడం బాధాకరమన్నారు. దేశ ప్రయోజనాలను కాపాడడంలో బీజేపీ వైఫల్యం చెందిన విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఈసంపెల్లి బాబు, భూక్య సమ్మయ్య, కోరబోయిన కుమారస్వామి, హన్మకొండ శ్రీధర్, పుచ్చకాయల కృష్ణారెడ్డి, బాలకృష్ణ, రాములు, రాజు, నర్సింహ, అంజనేయులు పాల్గొన్నారు.

గీసుగొండలో 4నుంచి స్పోర్ట్స్ మీట్

గీసుగొండ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 4 నుంచి గీసుగొండ జెడ్పీ పాఠశాలలో గీసుగొండ, సంగెం మండలాల బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్లు నెహ్రూ యువ కేంద్రం ప్రతినిధి వెల్లండ సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, షెటిల్, రన్నింగ్ పోటీలలో పాల్గొనవచ్చని చెప్పారు. 18 నుంచి 29ఏళ్ల వరకు వయస్సు గల ఆసక్తి గల యువతీ, యువకులు పాల్గొనవచ్చని వివరించారు. పూర్తి వివరాలకు 9640881670, 7659071405 నంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ గ్రీన్ కార్ప్స్ తెలంగాణ వారి సౌజన్యంతో వరంగల్ జిల్లా విద్యాశాఖ, జిల్లా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిరుపయోగ పదార్థాల నుంచి వినియోగ పదార్థం తయారీపై జనవరి 31న నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు రియాజ్ సుల్తానా, అఖిలేశ్వర్, స్పందన, సిరిచందనలు ప్రథమ బహుమతితో ప్రశంసా పత్రాలు అందుకున్నారు. అలాగే మండల స్థాయిలో నిర్వహించిన భౌతిక శాస్త్ర ఆన్‌లైన్ పోటీల్లోనూ ప్రథమ బహుమతితో పాటు రూ. 3వేల నగదు బహుమతి సాధించారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభను చాటిన విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు అధ్యాపకులు అభినందించారు.

రైతు బీమా చెక్కు అందచేత

గీసుగొండ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మనుగొండకు చెందిన కూమమల్ల రాజు కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, మృతుని భార్యకు రూ.5లక్షల రైతు బీమా చెక్కును శనివారం మండల వ్యవసాయాధికారి హరిప్రసాద్‌బాబు అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, ఏఈవో, గ్రామస్థులు పాల్గొన్నారు.

చెట్లకు రాఖీలు కట్టిన మోడల్ విద్యార్థులు



చెట్టుకు రాఖీలు కుడుతున్న విద్యార్థులు

ఖానాపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బుధరావుపేట ప్రభుత్వ మోడల్ పాఠశాలలో శనివారం విద్యార్థులు పాఠశాల ఆవరణలోని చెట్లకు రాఖీలు కట్టారు. వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకుంటున్నట్లు ప్రతిజ్ఞచేశారు. ప్రిన్సిపాల్ పెరక సునీత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవాళితో పాటు జీవ జాతులను రక్షించే చెట్లకు రక్షణగా ఉండాలన్నారు. ప్రతీ పౌరుడు పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేందర్, సయేర, రాధిక, రవికుమార్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్‌లో మొండ్రాయి విద్యార్థినిలు



ప్రతిభను చాటుకున్న విద్యార్థులు

సంగెం, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని ఓ సిటీ మైదానంలో 2024 డిసెంబర్ 4న జరిగిన జిల్లాస్థాయి సీనియర్ సాఫ్ట్ బాల్ ఎంపిక పోటీల్లో ప్రతిభను కనబర్చిన మండలంలోని మొండ్రాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు లక్ష్మిప్రసన్న, జి. చిన్నులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం కె.విజయ, విద్యా కమిటీ చైర్‌పర్సన్ ఎ.శ్రీలతలు తెలిపారు. నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్‌లో నేడు (ఆదివారం) జరిగే సీనియర్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎం, చైర్‌పర్సన్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

సఖి సెంటర్ సేవలపై అవగాహన

రాయపర్తి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాపురంలో శనివారం సఖి సెంటర్ సేవలపై మహిళలకు కేంద్రం నిర్వాహకులు స్వప్న, తిరుమల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సఖి కేంద్రం మహిళ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ, సర్వోదయ సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తుందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సఖి సెంటర్లను నడిపిస్తున్నాయని తద్వారా బాధిత మహిళలకు కౌన్సెలింగ్, పోలీస్ సహాయం, న్యాయ సహాయం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అనూష, సీసీ దేవేంద్ర, కార్యదర్శి రాజబాబు, వీవోఏ సంధ్యారాణి, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

చెత్తశుద్ధి ఏది?

● వర్ధన్నపేట శివారులో డంపింగ్

● కనిపించని పరిశుభ్రత

● రోగాలబారిన జనం

● పట్టించుకోని అధికారులు

వర్ధన్నపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఇంటి నుంచి సేకరించిన చెత్తను ఆ ఊరి చివరే పడేస్తున్నారు. ఫలితంగా ఆ గ్రామస్థుల తిప్పలు వర్ణనాతీతం. నిత్యం యార్డు నుంచి వెలువడే దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. చెత్తను కాల్చడం వల్ల ఎగిసిపడుతున్న మంటలు, వెలువడే పొగతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

ఇదీ పరిస్థితి..

వర్ధన్నపేట మునిసిపాలిటీ పరిధిలో 12 వార్డులు, సుమారు 10,238 ఇళ్లు ఉన్నాయి. పట్టణ జనాభా 20వేల వరకు ఉంది. ప్రతీ రోజు మునిసిపల్ సిబ్బంది తడి, పొడి చెత్తను సేకరిస్తున్నారు. ఇందులో ఎక్కువగా కూరగాయలు, ఆహార పదార్థాల వ్యర్థాలే ఉంటున్నాయి. చెత్త సేకరణకు అధికారులు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. పారిశుధ్య సిబ్బంది చెత్త సేకరిస్తుండగా పారిశుధ్య పనులు చేపట్టేందుకు మరో 10 మంది విధుల్లో ఉన్నారు.

చెత్తపై ఏది పోరు..

చెత్తను వినియోగపరిస్తే అందరికీ ఉపయోగపడుతుంది. చెత్తను రీసైక్లింగ్ చేద్దాం. రీయూస్ చేద్దాం, చెత్తపై సమరం సాగిద్దాం, చెత్త రహిత మునిసిపాలిటీగా తీర్చిదిద్దుదాం అనే మాటలు మూటలుగానే మారాయి. ఇళ్లలో సేకరించి చెత్తను మునిసిపాలిటీ పరిధిలోని 5వ వార్డు గుబ్బెటతండా, 7వ వార్డు, జగ్గపేట శివారు మధ్యలో వేస్తుండడంతో ఈగలు, దోమలు విపరీతంగా చేరి సమీపంలోని తెట్టెకుంటతండా గిరిజనులను రోగాల బారిన పడేస్తున్నాయి. తండా శివారులో చెత్తను వేయవద్దని స్థానికులు వేడుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తను తరచుగా తగులబెడుతుండడంతో డంపింగ్ యార్డు రావణకాష్టంలా నిత్యం మండుతూనే ఉంటోంది. గుట్టలు, గుట్టలుగా పేరుకుపోయిన చెత్తలో ప్లాస్టిక్ వ్యర్థాలు, ఆస్పత్రి వ్యర్థాలు సైతం ఉంటున్నాయి. చెత్తను సిబ్బందే తగులబెడుతున్నారా ? లేక ఏదైనా రసాయన చర్యల వల్ల మండుతుందో అనేది తెలియడం లేదు. అసలే దుర్వాసన, ఆపై ఘాటైన పొగతో ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.

ఆస్పత్రుల పాలవుతున్నాం

నర్సింహా, రైతు, టెట్టకుంట తండా

వర్ధన్నపేట మునిసిపాలిటీ శివారులో చెత్త వేయడం వల్ల తండాలో విపరీతంగా ఈగలు, దోమలు వ్యాపిస్తున్నాయి. దీంతో చాలా మంది రోగాల బారిన పడి ఆస్పత్రి పాలవుతున్నారు.



పేరుకుపోయిన చెత్త

పొగతో అవస్థలు పడుతున్నాం

మేగ్యానాయక్, రైతు, టెట్టకుంట తండా

చెత్తను కుప్పలుగా పోసి తగులబెడుతున్నారు. దీంతో దట్టమైన పొగ కమ్ముకుంటోంది. ఈ పొగతో ఊపిరి ఆడడం లేదు. దుర్వాసన వెదజల్లుతోంది.

చర్యలు తీసుకోవాలి

రాజు, రైతు, టెట్టకుంట తండా

గ్రామశివారులోని డంపింగ్ యార్డును తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. గిరిజనులమైన మేము పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఎవరు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

దంత సంరక్షణ గర్భిణులకు అవశ్యం



మౌత్‌వాష్‌లు అందజేస్తున్న డాక్టర్ భరత్‌రెడ్డి

వర్ధన్నపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : నోటి, దంత సంరక్షణ గర్భిణులకు అవశ్యమని, అలక్ష్యం చేస్తే పోషకాహార లోపం కలిగి తక్కువ బరువు ఉండే అనారోగ్య శిశువులు జన్మించే అవకాశం ఉంటుందని జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి, వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ రామూర్తి,ఆర్‌ఎంవో విజయ్ కుమార్, డెంటల్ సర్జన్ భరత్‌రెడ్డి అన్నారు. శనివారం వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో దంత విభాగం ఆధ్వర్యంలో గర్భిణుల నోటి ఆరోగ్య పరిరక్షణకు ఉద్దేశించబడిన మౌత్ వాష్‌లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులలో నోరు, దంత చిగుళ్ల ఆపరేషన్‌లు వాయిదా వేయడం జరుగుతుందని, తప్పని పరిస్థితుల్లో రెండవ త్రైమాసికంలో స్త్రీ వైద్య నిపుణుల సలహ మేరకు నిర్వహిస్తామన్నారు. హార్మోన్‌ల హెచ్చు తగ్గుల వల్ల కలిగే ఇన్‌ఫ్లమేషన్, పాచి నివారణ లక్ష్యంగా మౌత్‌వాష్‌లను దంత వైద్యులు సూచిస్తారన్నారు. డెంటల్ సర్జన్ సూచించే ఆల్కహాలు రహిత మౌత్‌వాష్‌లనే వాడాలన్నారు. చిగుళ్ల నుంచి రక్తస్రావమవుతుందని వేలును రుద్ది పళ్లను తోముకోవడం సరికాదన్నారు. గర్భిణులు మెత్తని టూత్‌బ్రేస్‌లు మాత్రమే వాడాలని, వీలైతే రోజుకు రెండు సార్లు బ్రేస్ చేయాలని కోరారు. మార్కెట్‌లో లభించే మేడికేటెడ్ పేస్టులు ఇష్ట ప్రకారం వాడితే 30ఏళ్ల లోపు వారికి ఎక్కువ దుష్ప్రభావం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, ఫార్మసిస్టులు తదితరులు పాల్గొన్నారు.

7న జరిగే చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి



నర్సంపేటలో వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంఎస్పీ నాయకులు

నర్సంపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో ఈనెల 7న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో లక్షల డప్పులు, వేల గొంతులు అనే కార్యక్రమంలో భాగంగా చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు కల్లెపల్లి ప్రణయదీప్, ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు తడుగుల విజయ్‌కుమార్ పిలుపు నిచ్చారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొలకలూరి నిరంజన్, చింతం సిద్ధు, అలువాల హరీష్, మునిగె యాకూబ్, వేల్పుగొండ రాజు, మాదాసి బాబు, గుండేటి వీరేశం. సాంబయ్య, బోయిని నాయణజాంబవ్ రాజు, నవీన్ పాల్గొన్నారు.

● రాయపర్తి (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు వేల గొంతుల వాల్‌పోస్టర్‌ను శనివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యం లో ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు కందికట్ల విజయ్ మాదిగ ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ ఏబీసీడీలుగా అమలుకై లక్ష డప్పులు వేల గొంతుల కార్యక్రమానికి భారీ సంఖ్యలో గ్రామాల నుంచి తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా కార్యదర్శి ఐత రాజు, మండల పార్టీ అధ్యక్షుడు కంతుల జంపి, నాయకులు నరేష్, యాకన్న, రమేష్, చందు శివ, రాజు, శేఖర్ పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం నూతన కమిటీ



సాంబయ్య



వెంకటేశ్వర్లు

ఖానాపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మున్నూరు కాపు ఖానాపురం గ్రామ కమిటీని శనివారం ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాగం సాంబయ్య, ఉపాధ్యక్షుడిగా గొట్టం సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా పంతిని వెంకటేశ్వర్లు, కోశాధికారిగా అన్నం ప్రకాశ్, గౌరవ అధ్యక్షుడిగా కందుల శ్రీను, గౌరవ సలహాదారుగా జ్యోతుల భిక్షమయ్య, కమిటీ సభ్యులుగా రాగం సత్యం, మానిపెల్లి వెంకన్న, కందుల రవీందర్, కొత్త వీరన్న, కందుల వెంకన్న, అన్నం మోహన్, సంక్రాంతి సురేష్, కాంశెట్టి గాంధీ, అన్నం కొంరయ్య, ఉప్పు చంద్రయ్యలను ఎన్నుకున్నారు. కాగా, పంతిని వెంకటేశ్వర్లు వరుసగా 8 పర్యాయాలు ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావడంపై పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

ధర్మరావుపేట వెలమ సంఘం కార్యవర్గం



రాజేశ్వరరావు



మోహన్‌రావు

ఖానాపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధర్మరావుపేట వెలమ సంఘం నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నడిపెల్లి రాజేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడిగా కొలుగూరి రవి, ప్రధాన కార్యదర్శిగా అడ్డూరి మోహన్‌రావు, సహాయ కార్యదర్శిగా కత్తాల సంపత్‌రావు, కోశాధికారిగా తక్కళ్లపల్లి వెంకటేశ్వరరావు, గౌరవ సలహాదారులుగా కత్తాల మాదారావు, పొలసాని రవి, ఆరెల్లి రాంచంద్రయ్య, సంపత్‌రావు, కమిటీ సభ్యులుగా బలుగూరి విజాకర్‌రావు, సురినేని బుజంగరావు, నాగినేని వెంకటేశ్వరరావు, కోదాటి రవి, తక్కళ్లపల్లి కర్ణాకర్, కత్తాల వెంకటేశ్వర్లు, పొలసాని సాగర్‌రావు, కోదాటి విద్యాసాగర్‌రావు, తక్కళ్లపల్లి నర్సింగరావు, బోంపెల్లి వెంకన్న, ఎర్రబెల్లి విజయ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

మడేలేశ్వర స్వామి జయంతి వేడుకలు

గీసుగొండ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎలుకుర్తిహవేలిలో మడేలేశ్వరస్వామి (శివుడు) జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ రజక సంఘం ఆధ్వర్యంలో శివాలయంలో ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు ఐలోని సత్యనారాయణ, చంద్రయ్య, మల్లేశం, గంగాధరాగిరి, ఎల్లయ్య, నల్లతీగల శంకర్, భాస్కర్, తిరుపతి, ఐలోని అభిషేక్, అశోక్, నాగరాజు, సుమన్, శివ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పెయింటర్లకు సంక్షేమ పథకాలు అందించాలి

నెక్కొండ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎంతో శ్రమించి పెయింటింగ్ పనులు చేస్తున్న కార్మికులకు శ్రమకు తగిన ఫలం లభించక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఎఐటీయూసీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం నెక్కొండలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించి ఆదుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక చట్టాలు గ్రామీణ స్థాయి కార్మికులకు చేరడం లేదన్నారు. కార్యక్రమంలో మండల పెయింటర్స్ యూనియన్ అధ్యక్షకార్యదర్శులు ఈదునూరి అనిల్, మైదం రాజు, కార్మికులు ఒడ్డురి సంపత్, ప్రశాంత్,యాకయ్య, శ్రీనివాస్, మధు, కల్యాణ్, కరుణాకర్, రమేష్, రవి, సల్మాన్, రాము, సునీల్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఆలయ పరిసరాలను శుభ్రం చేయాలి

వర్ధన్నపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణ కేంద్రంలోని బాల ఆంజనేయ స్వామి ఆలయం పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రంగా ఉన్న చెట్లు, చెత్తను శుభ్రం చేయాలని కోరుతూ శనివారం హనుమాన్ సేవ సమితి ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. అందజేసిన వారిలో ఆరెల్లి నాగర్జున్, మణిదీప్, దాసరి రాజు, శేఖర్, రాయిని నరేందర్, ఆవుల ప్రవీణ్, రామగిరి క్రాంతి, విష్ణు తదితరులు ఉన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి



మార్కండేయ,వంశవృక్షం ఫొటోలను బహూకరిస్తున్న డాక్టర్ రమేశ్

నర్సంపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మార్కండేయ కాలనీలో శనివారం పద్మశాలీల ఆరాధ్య దైవం మార్కండేయ జయంతి వేడుకలను పెండె శివానంద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పద్మశాలీలకు మార్కండేయుడు, వంశవృక్షం చిత్రపటాలను డాక్టర్ రమేశ్ బహూకరించారు. మార్కండేయ కాలనీ అభివృద్ధికి, మార్కండేయ ఆలయ నిర్మాణానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి సంఘం అసోసియేట్ అధ్యక్షుడు దుస్స శివశంకర్, రాష్ట్ర కార్యదర్శి వలసదాసు శ్యామ్, మార్కండేయ కాలనీ కార్యదర్శి సుభాస్, సర్వ శ్రీధర్, తక్కళ్ళపల్లి ఉమ, నరేందర్, పాశికంటి రమేశ్, మల్లేశం, మహాలక్ష్మి, కాలనీవాసులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఒకరికి తీవ్ర గాయాలు

చెన్నారావుపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఒకరి తీవ్రగాయాలపాలైన సంఘటన మండలంలోని తిమ్మారాయిన్ పహాడ్ గ్రామ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... ఇదే గ్రామానికి చెందిన ఈలసారపు సురేష్ అనే వ్యక్తి తన కారులో చెన్నారావుపేటకు వచ్చి ఇంటికి వెళ్తున్న క్రమంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే చెట్టుకు ఢీకొట్టింది. దీంతో అతని తలకు తీవ్రగాయాలుకావడంతో స్థానికులు గమనించి వెంటనే 108కి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది ఈఎంటీ రాజేంద్రప్రసాద్, పైలెట్ సీహెచ్ రాజులు వెంటనే చికిత్సల కోసం నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో గీత కార్మికుడి మృతి



రాజు (ఫైల్)

సంగెం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు తాటిమట్టలకు 11కేవీ విద్యుత్ వైర్లు తగిలి విద్యుదాఘాతంతో గీతకార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని ఆశాలపల్లిలో శుక్రవారం రాత్రి జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పంతంగి రాజు(38) వృత్తిరీత్యా కల్లుగీసేందుకు శుక్రవారం రాత్రి గ్రామ శివారులోని తాటిచెట్టు ఎక్కి కల్లుగీస్తుండగా పక్కనే ఉన్న 11కేవీ వైరు ప్రమాదవశాత్తు తాటిమట్టలకు తగలడంతో వాటికి తగిలిన రాజుకు విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య మమత, ఇద్దరు కూతుర్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం ఉపాధ్యక్షుడు పటాపురం ఏకాంతం గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ గడ్డమీది రమేష్‌లు పరామర్శించారు.

గాయపడ్డ మహిళ మృతి



రాజు (ఫైల్)

చెన్నారావుపేట, ఫిబ్రవరి 1 : (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని లింగగిరి గ్రామంలో జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం... ఇదే గ్రామానికి చెందిన అనుముల జ్యోతి (36) పని నిమిత్తం తన పెద్ద కుమారుడి ద్విచక్ర వాహనంపై శుక్రవారం ఉదయం వరంగల్‌కు వెళ్తోంది. ఈ క్రమంలో గ్రామ శివారులో ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంపై నుంచి జ్యోతి కింద పడి పోయింది. దీంతో తలకు బలమైన గాయం కావడంతో చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మృతురాలికి భర్త యాదగిరి, ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్‌రెడ్డి తెలిపారు.

గుడుంబా విక్రయదారులపై కేసు

నల్లబెల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి ఎక్సైజ్ శాఖ, అర్బన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సంయుక్తంగా గుడుంబా స్థావరాలపై దాడులు చేశారు. ఈ దాడుల్లో 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు.గుడుంబా విక్రయించే మూడు విజయ, బోళ్ల సమ్మక్క, గొర్రె సాంబలక్ష్మిలపై కేసును నమోదు చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ ముప్పు కృష్ణ ఎదుట బైండోవర్ చేశారు. గుడుంబాను విక్రయిస్తే జైలు శిక్ష పడుతుందని తహసీల్దార్ వారిని హెచ్చరించారు. ఈ దాడుల్లో నర్సంపేట ఎక్సైజ్ నరేష్‌రెడ్డి, అర్బన్ టాస్క్‌ఫోర్స్ ఎస్సై రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు

నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు

● డీఈవో జ్ఞానేశ్వర్



నారక్కపేటలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో జ్ఞానేశ్వర్

నల్లబెల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వరంగల్ డీఈవో జ్ఞానేశ్వర్ అన్నారు. శనివారం మండలంలోని నారక్కపేట, రుద్రగూడెం, నందిగామ, శనిగరం ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. రుద్రగూడెం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం సరిగ్గా లేదని విద్యార్థులు డీఈవో జ్ఞానేశ్వర్‌కు తెలపడంతో, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పాఠశాల హెచ్‌ఎంకు ఆదేశించారు. రుద్రగూడెం పాఠశాలలో రెండు రోజుల నుంచి బడికి రాకుండా, బడికి వచ్చినట్లు రిజిస్టర్‌లో నమోదు చేయడంపై ఆ ఉపాధ్యాయుడిపై తీవ్రమైన చర్యలు తీసుకుంటామని డీఈవో తెలిపారు. శనిగరం పాఠశాలలో రిజిస్టర్ విధానం సరిగ్గా లేదని, బడికి వచ్చిన అభివృద్ధి నిధులు మరో వ్యక్తి అకౌంట్‌లోకి బదిలీ అయినట్లు తెలుస్తోందని, ఆయా ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తప్పకుండా తీసుకుంటామని ఉపాధ్యాయులను హెచ్చరించారు. ఉపాధ్యాయులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ, సమయపాలన పాటించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నందిగామ పాఠశాలలో డీఈవోను విద్యార్థి సంఘాల నాయకులు కలిసి పాఠశాలల్లో సమర్థవంతంగా పనిచేయని ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

బీసీ రాజకీయ యుద్ధ భేరికి మద్దతు

వర్ధన్నపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలో అదివారం జరిగే బీసీ రాజకీయ యుద్ధ భేరికి తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం తరఫున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కంజర్ల మహేష్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వివేకానంద, జంగిలి భాస్కర్, మంద అమర్‌నాథ్ ఉన్నారు.

బతుకులు మారాలంటే రాజ్యాధికారం రావాల్సిందే..

బతుకులు మారాలంటే బీసీలకు రాజ్యాధికారం రావల్సిందేనని పోరాటం మొదలైందని బీసీ సంఘం నాయకులు పూజరి రాజు, అరెల్లి నాగార్జున అన్నారు. శనివారం వర్ధన్నపేట పట్టణంలో బీసీ సంఘం యువ నాయకులు బీసీ రాజకీయ యుద్ధభేరి సభకు తరలడం కోసం సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మణిదీప్, దసరి రాజు, శేఖర్, రాయిని నరేందర్, ఆవుల ప్రవీణ్, రామగిరి క్రాంతి, విష్ణు, రాజేష్, జగన్, శరత్, శేఖర్, రంజిత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ అవిష్కరణ

వర్ధన్నపేట రూరల్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇల్లందలో నేడు (ఆదివారం) హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగే బీసీ సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించి, సభను విజయవంతం చేయాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు చొప్పరి సోమయ్య కోరారు.ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు ముదిరాజులు ఎక్కువ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సంగినేని భీమరాజ్, ఉప్పరపెల్లి సొసైటీ అధ్యక్షుడు చిలకలపల్లి అనిల్, చెన్నారం సొసైటీఅధ్యక్షుడు గొర్రె భాస్కర్ పాల్గొన్నారు.